నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరి
డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధారణ ఆదివారం నుంచి తప్పనిసరి చేస్తూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేసే విధంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) చర్యలు తీసుకోవడం జరిగిందని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. హెల్మెట్ ధారణపై తాండవ యోగేశ్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 3707 ద్విచక్ర వాహన ప్రమాదాలు జరిగితే అందులో 3047 మంది మరణించడం బాధాకరమైన విషయమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించకపోతే చట్ట ప్రకారం చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పంద్రాగస్టు వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయండి
కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3 : రాజమహేంద్రవరం ఆర్ట్సు కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులలతో సమీక్షించారు. ఆగస్టు 15 వేడుకలు విజయవంతం చేయాలన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన వాని పేర్లనే అవార్డులకు సిఫార్సు చేయాలని సూచించారు. అవార్డుకు గౌరవం పెరిగే విధంగా ఉత్తమ పని తీరును కనబరిచిన వారిని మాత్రమే గుర్తించి పేర్లను ఈ నెల 10వ తేదీలోగా పంపించాలన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలతో కూడిన శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 15న ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు ,ఇతర ప్రముఖులు ప్రతి ఒక్కరు ఆహ్వానితులేనన్నారు. సమావేశంలో జేసీ ఇన్‌చార్జి,డీఆర్వో జి.నరసింహులు, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ,కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి
జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు, ఆగస్టు 3 : కౌలు కార్డు పొందిన రైతులందరికి వ్యవసాయ రుణాలందించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. కొవ్వూరు యూనియన్ బ్యాంకును శనివారం సందర్శించి మాట్లాడారు. గుర్తింపు కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయానికి అవసరమగు పెట్టుబడి సాయం కింద పంట రుణాలు అందించాలన్నారు. పంట రుణాలు తీసుకున్న కౌలు రైతులు సకాలంలో తమ రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు పి. చంద్రశేఖర్,వ్యవసాయాధికారి గంగాధర్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 3 : పీఎం విశ్వ కర్మ యోజన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన పీఎం విశ్వకర్మ యోజన నోడల్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ స్థాయిలో డీపీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టి నిబంధనల మేరకు పేర్లు నమోదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రూరల్ ప్రాంతాల్లో 79 వేల మందిని గుర్తించగా 65 వేల మంతికి పైగా డేటా పరిశీలించినట్టు జిల్లా పరిశ్రమల అధికారి పికేవి ప్రసాద్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 63 వేల మందిని గుర్తించగా డేటా ఎంట్రీ జరుగుతున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైనా ఐటీఐలో ప్రవేశం

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్ ఫెయిలైన అభ్యర్థులకు జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు ఐటీఐలలో 2024-25 ఏడాదికి ప్రవేశాలకు మూడో విడ త దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ ఆల్ఆర్ఆర్ కృష్ణన్ పేర్కొన్నారు. అధికారిక వెబ్‌సైటులో ఈ నెల 26 వరకూ దరఖాస్తు చేసుకొని రసీదు పొందాలన్నారు. 27 వరకూ వెరి ఫికేషన్ ప్రక్రియ ఉంటుదన్నారు.వివరాలకు 9294050231 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.



స్కూల్ ఆటోలపై కేసులు రూ.3 లక్షల జరిమానా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3 : జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆటోల తనిఖీలు చేపట్టి పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతున్న 50 ఆటోలపై కేసులు నమోదు చేశారు. రూ.2,87,700ల జరిమానా వసూలు చేశారు. ప్రస్తుతం కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో స్కూల్ ఆటోల్లో ఎక్కువ మంది విద్యార్థులను తీసుకెళ్లడంపై ఫిర్యాదులు అందడంతో చర్యలు తీసుకున్నామని జిల్లా రవాణా అధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరంగా చేపట్టామని, ప్రత్యేక డ్రైవ్ ద్వారా కేసులు నమోదు చేశామని తెలిపారు. తల్లిదండ్రులు ఆటోల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎవరైనా మోటారు వాహనాల చట్టాల ఉల్లంఘనలకు పాల్పడినా, నిబంధనలు పాటించకపోయినా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.



తీసెయ్.. వేసెయ్!

వైసీపీతో అంటకాగినోళ్లకు చుక్కలే

- నాడు వైసీపీతో చెట్టాపట్టాల్
- ప్రస్తుత ఎమ్మెల్యేలపై కేసులు
- పోలీస్ స్టేషన్లలో సెటిల్‌మెంట్లు
- ఒక్కో శాఖ నుంచి ఏరివేత
- పలువురు అధికారుల బదిలీ
- కలెక్టర్ నుంచి ఆరంభం
- తరువాత ఎస్పీ..జేసీ వంతు
- కమిషనర్..జేసీల మార్పు
- తహశీల్దార్లకు స్థాన చలనం
- ఇద్దరు సీఐలకు నో పోస్టింగ్
- నేడు లెక్కలు తీస్తున్న కూటమి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో అధికారులు రెచ్చిపోయారు.. వీళ్లు వైసీపీ నాయకులా.. లేదంటే అధికారులా అనేంతగా అంటకాగారు.. వైసీపీ నాయకులు అన్నారని 30 ఏళ్లు జగనే సీఎంగా ఉంటారని అనుకున్నారో ఏమో కానీ.. వాళ్లు చెప్పిందల్లా చేసేశారు.. మాజీ ఎమ్మెల్యేలని చూడకుండా.. ప్రతిపక్ష పార్టీ నాయకులనీ చూడకుండా.. కనీస గౌరవలేకుండా ప్రవర్తించారు. రోజులన్నీ ఒకేలా ఉంటాయా.. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. వైసీపీతో అంటకాగిన అధికారుల కోరలు పీకేస్తున్నారు.. అన్ని విభాగాల్లోనూ ఉన్న అధికారులను తీసి పక్కన పెడుతున్నారు. పోలీసులనైతే వీఆర్‌కి పంపుతుంటే.. ఉన్నతాధికారులను ఆయా డిపార్ట్‌మెంట్లకి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశిస్తున్నారు. దీంతో నాడు వైసీపీ ప్రభుత్వంలో రెచ్చిపోయిన అధికారులంతా బోనులో పడ్డ ఎలుకలా ఏం చేయాలో తోచక కొట్టుకుంటున్నారు.

మాట్లాడితే కేసులే..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇపుడిప్పుడే పాత వాసనలు పోతున్నాయి. గత వైసీపీ పాలనలో అధికార యంత్రాంగం అంతా వైసీపీ నేతలు చెప్పినట్టే చేసి, చట్టాలకు, నిబంధనలకు తూట్లు పొడిచిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష నాయకులకు ప్రజలకు స్వేచ్ఛ ఉండేది కాదు. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేశారు. ఎక్కడ సమావేశం పెట్టుకోవాలన్నా, తమ హక్కుల కోసం ఆందోళన చేయాలన్నా అనుమతులుండేవి కావు. ఎవరైనా ఆందోళనకు పిలుపు ఇస్తే అందరికీ 41 నోటీసులు జారీ, సెక్షన్ 30, సెక్షన్ 144 అమలు, సాధారణ ప్రజలైతే పోలీసు స్టేషన్లలో మాట్లాడే పరిస్థితే ఉండేది కాదు. ప్రతిపక్షాలైనా, ఉద్యోగులైనా సరే.. హౌస్ అరెస్ట్ చేసేవారు. తెలుగుదేశం నేతలనైతే బయటకే రానిచ్చేవారు. కాదని బయటకు వస్తే కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. దీంతో నాటి ప్రతిపక్ష నాయకులపై పదుల సంఖ్యలో కేసులు పెట్టారు. ఒకసారి ఆ లిస్ట్ చూస్తే అమ్మో అనక మానరు...

నాటి కలెక్టర్ ఇష్టారాజ్యం..

వైసీపీ పాలనలో భూఆక్రమణలు, బెదిరింపులు, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయ్, సారా, డ్రగ్స్ బ్యాచ్‌లు పెచ్చురేగిపోయిన సందర్భాలు అనేకం. ఇక అవినీతికి అంతే లేదు. జిల్లా కలెక్టరేట్ కేంద్రంగానే భూదందాలు జరిగిన సంగతి తెలిసిందే. గోపాలపురం మండలంలో భీమోలులో ఒక భూ వివాదం కోర్టులో ఉండగానే గత కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ వైసీపీ నేతలతో కుమ్మక్కయి సుప్రీంకోర్టును తప్పుదారి పట్టించి కౌలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇతరులకు అమ్మించేసిన సంగతి తెలిసిందే.ఇందులో రూ. కోట్లు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి.రాజమ హేంద్రవరం రూరల్‌లో సుమారు 23 ఎకరాల భూమి రికార్డులు సృష్టించి ఇలాగే పక్కదారిపట్టించారు. సమన్వయం పేరిట రెవెన్యూ, పోలీసు ఒకటైపోయి అనేక అక్రమాలకు పాల్పడ్డారు. తహశీల్దార్లు, డీటీలను భయపెట్టి దానవాయిపేటలో ఒకచర్చి యజమానికి చెరువు పోరంబోకు భూమిని రాసిచ్చి, దానిని వేర్వే వాళ్లకు అమ్మేసేటట్టు అధికారులు సహకరించినట్టు ఆరోపణలున్నాయి.గ్రామ స్థాయి నుంచి కలెక్టరేట్ వరకూ అధికారులు, ఉద్యోగులు ఇష్టమున్నా లేకున్నా వైసీపీ నేతలు చెప్పినట్టు చేశారు. దివాన్‌చెరువులో ఓ కామన్ సైట్‌లో ఒక వ్యక్తి ఇల్లు కట్టుకోవడానికి ఏకంగా గత కలెక్టర్ జోక్యం చేసుకుని, పంచాయతీ సెక్రటరీని బెదిరించిన సంగతి తెలిసింది. అది కామన్ సైటని, తాను రాసివ్వలేనని చెప్పిన సెక్రటరీ వెంటనే మరో కమండలానికి స్వయంగా కలెక్టర్ బదిలీ చేయించడం గమనార్హం.దీంతో ఆ కలెక్టర్, జేసీ బదిలీపై వెళ్లిపోయారు. పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్ స్టేషన్లుగా మారిపోయాయి. కొందరు నాయకులైతే తమ కులానికి చెందిన సీఐలనే నియమించుకున్నారు. ఇక వాళ్ల ఇష్టం ఒక ప్రక్క రాజకీయ అండ, మరొక ప్రక్క కులం కూడా కలిసి రావడంతో వాళ్ల ఇష్టానుసారం వ్యవహరించారు. సీఐలు ఐడీ పార్టీ కింద కొందరు కానిస్టేబుళ్లను పెట్టుకుని వాళ్ల పాత కేసుల్లో ఉన్నవారితో, గల్ఫ్ ప్రాంతాలకు మహిళలను పంపేవారితో అంటకాగి తప్పుడు కేసులు పెట్టించి పోలీసు స్టేషన్లలో సెటిల్ చేసిన సందర్భాలు ఉన్నాయి. సాక్షాత్తు అప్పట్లో హోం మినిస్టరే జిల్లా వాసి అయినప్పటికీ పోలీసుల ఆగడాలను ఆపలేకపోయారు.ఆమె నియోజక వర్గంలోనే అనేక దారుణాలు జరిగిన సంగతి తెలిసిందే. ఇలా అన్ని వ్యవస్థలు నిర్వీర్యమైపోయాయి.

అనపర్తి ఎమ్మెల్యేపై 39 కేసులు

ప్రస్తుత అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై 39 కేసులు పెట్టారు. చంద్రబాబుపై అనపర్తిలో 2, బిక్కవోలులో ఒక కేసు పెట్టారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై 11 కేసులు పెట్టారు. ఇటీవల 3 కొట్టేశారు. 8 పెండింగ్‌లో ఉన్నాయి. ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావుపై 2 కేసులు ఉన్నాయి. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కూడా సెంట్రల్ జైలులో బెయిల్ లేకుండా చాలా రోజులు మగ్గారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణపై 6 కేసులు నమోదు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిపై 8 కేసులు పెట్టారు. 6 కొట్టేశారు.. రెండు పెండింగ్‌లో ఉన్నాయి. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుపై 6 కేసులు పెట్టారు. నిడదవోలు ఎమ్మెల్యే, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌పై కూడా 8 కేసులు పెట్టారు. ఈ నెల 7న ఒక కేసులో కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. ఇలా వాళ్లూ వీళ్లూ అని లేదు.. అధిష్ఠానం ఆదేశించడం లోకల్ అధికారులు కేసులు పెట్టేయడం పరిపాటిగా మారింది. గతేడాది మేలో రాజమహేంద్రవరంలో జరిగిన మహా నాడు సక్సెస్ కాకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఆదిరెడ్డి అప్పారావులను జైలులో నిర్బంధించారు. వైసీపీతో అంటకాగిన వారికి చెమటలు పడుతున్నాయి.

లెక్కతేలుస్తున్న కూటమి..

కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడిన.. వైసీపీతో అంటకాగిన అధికారులులెక్కలు తీస్తున్నారు. జిల్లాలో చూస్తే మొదట జిల్లా కలెక్టర్ మాధవీలతపై వేటు వేశారు. పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలనా శాఖలో రిపోర్ట్ చేయమని ఆదేశించిన సంగతి తెలిసిందే. తర్వాత అప్పటి ఎస్పీ పి.జగదీష్‌కు పోస్టింగ్ ఇవ్వకుండా బదిలీ చేశారు. ఇసుక అక్రమాలపై విచారణ చేసిన రిపోర్టు ఇవ్వమంటే అప్పటి కలెక్టర్ మాధవీ లత మాదిరిగానే ఎస్పీ జగదీష్ కూడా తప్పుడు రిపోర్టు ఇచ్చిన సంగతి తెలిసిందే.అప్పుడు వైసీపీతో అంటకాగిన వారిని ఒక్కొక్కరి వంతున బదిలీ చేస్తున్నారు. ఇటీవల ఐదుగురు డీఎస్పీలను ఒకేసారి బదిలీ చేశారు. ఒకా యనకు పోస్టింగ్ ఇవ్వలేదు. తర్వాత చాలా మంది సీఐలను బదిలీ చేశారు. కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చి, కొందరికి ఇవ్వలేదు. ఇంకా కొందరు కులంపేరుతో, వేరే కారణాలతో కాకా పట్టి కొనసాగుతున్నారు.జేసీ, మునిసిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. తహశీల్దార్లు బదిలీ అయ్యారే కానీ ఇంకా ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వ లేదు. గతంలో పని చేసిన నియోజకవర్గాలు,సొంత డివిజన్ల పరిధిలోనూ వారికి పోస్టింగ్‌లు ఇవ్వకూడదనే నిబంధన పెట్టడంతో చాలా మంది తహశీల్దార్లకు మింగుడు పడడం లేదు. ఎమ్మెల్యేలను కాకా పడుతున్నారు.రేపోమాపో వీరికి పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది. తాజాగా శుక్రవారం సీఐలను బదిలీ చేశారు.ఐదుగురిని బదిలీ చేయగా ఇద్దరికి పోస్టింగ్ ఇవ్వలేదు.ఒకరిని హోల్డ్‌లో పెట్టినట్టు సమాచారం.ఇంకా చాలా మంది బదిలీ అయ్యే అవ కాశాలు ఉన్నాయి.అధికారులు అప్పట్లో ఎలా వ్యవహరించా రనే ఎంక్వయిరీలు జరుగుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం జిల్లాకు కొత్తగా వచ్చే అధికారులైనా గుణ పాఠం నేర్చుకోవాలి.రాజ్యాంగాన్ని కాపాడుతూ చట్టప్ర కారం పనిచేస్తే పాలకులెవరైనా ప్రశాంతంగా ఉంటుంది.



కొవ్వాడ కాల్వ మ్యాప్ చూసి అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రతి రైతును ఆదుకుంటాం
ముంపు బాధిత రైతులకు ఎంపీ పురందేశ్వరి హామీ

గోపాలపురం/ దేవరపల్లి, ఆగస్టు 3 : పంట నష్టపోయిన ప్రతి రైతును ఎన్‌డీఏ ప్రభుత్వం ఆదుకుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం గోపాలపురం మండలం వెంకటాయపాలెం, చిట్యాల, చెరుకుమిల్లి ,దేవరపల్లి మండల గౌరీపట్నం గ్రామాల్లో ముంపు బారిన పడిన పంట పొలాలను శనివారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి ఆమె పరిశీలించారు.గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో ప్రవహిస్తున్న కొవ్వాడ, తాడిపూడి, యర్ర కాల్వల వరదనీటి ప్రవాహానికి ప్రతి ఏటా నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కలయికతో శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో 4600 మండలంలో ఎకరాలు దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారన్నారు. రైతులు ఆండ్రూ సత్తిరాజు, బుల్లిరాజు, దాపర్తి వీరకృష్ణ, దాపర్తి సోమరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్‌లు కొవ్వాడ కాల్వ కారణంగా ప్రతి ఏడాది వేలాది ఎకరాలు ముంపు గురవుతున్నాయన్నారు.కొవ్వాడ కాల్వ మ్యాప్ పరిశీలించారు.పంటనష్టం పూర్తి వివరాలను అధికారులు నమోదు చేయాలని ఆదేశించారు.ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది వర్షాకాలంలో రైతులకు ఈ పరిస్థితులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు,మండల అధ్యక్షుడు రొంగలి సత్య నారాయణ,ఏడీ చంద్రశేఖర్, ఏవో పి.రాజారావు,వీరరాఘవులు, మద్దిపాటి రమేష్, జ్యేష్ఠ శ్రీనివాస్,కాకర్ల రామతులసి, ఈలి శరత్‌బాబు, రాము,ఇల్లారి రాము,ప్రసాద్‌బాబు,తహశీల్దార్‌శ్రీనివాస్,ఎంపీడీవో ప్రభాకరరావు పాల్గొన్నారు.



నర్సరీ ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్

పర్యాటక కేంద్రంగా కడియం : మంత్రి దుర్గేష్

కడియం, ఆగస్టు 3: కడియం నర్సరీలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం కడియం నర్సరీలు పర్యాటకంగా అభివృద్ధిపై నర్సరీ అసోసియేషన్ సభ్యులు, నర్సరీ ప్రతినిధులతో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతిలతో కలిసి సమీక్షించారు. కడియం నర్సరీలలో మొక్కలు కొనుగోలు చేసేవారి కంటే పర్యాటకులు ఎక్కువ మంది వస్తుంటారన్నారు. అదనపు సౌకర్యాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం చేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నర్సరీలను మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా చేసుకుని ప్రతిపాదనకు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. కాటేజెస్ నిర్మాణం చేపట్టి ఒకటి రెండు రోజులు ఉండేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. 200 ఎకరాల స్థలంలో కెఫ్టేరియా, ఆర్టిస్టిక్ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కడియం నర్సరీల ఆధ్వర్యంలో ఎఫ్‌టీవోలు గుర్తింపు తీసుకురావడం ద్వారా వారు రూపొందించే ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కడియం నర్సరీలకు అంతర్జాతీయ గుర్తింపు ఉన్నా సరైన ప్రోత్సాహం లభించడం లేదన్నారు.నర్సరీ అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ కడియం నర్సరీలు పర్యాటకం ద్వారా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నట్టు తెలిపారు.సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి నరసింహులు, టూరిజం ఆర్‌డీవీ స్వామినాయుడు, పలువురు నర్సరీరైతులు, అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొనారు. సమావేశానికి ముందు కడియపులంక ఏపీ టూరిజం స్థలాన్ని శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎం సునీల్, ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ తదితరులు ఉన్నారు.



ముందడుగు!

మద్యం పాలసీపై కూటమి కసరత్తు

- త్వరలోనే నాణ్యమైన కిక్కు
- అక్టోబరు నుంచి కొత్త పాలసీ!
- పాత పద్ధతిలో అమలుకు యోచన
- ప్రైవేటు షాపులు.. అన్ని బ్రాండ్లూ
- జగన్ పిచ్చి బ్రాండ్లు ఖతం
- పక్కరాష్ట్రాల పాలసీపై అధ్యయనం
- ఈ నెల 12 లోపు నివేదికకు ఆదేశం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గొంతులో నాణ్యమైన చుక్కపడి ఐదేళ్లయ్యింది. ధరలతో జేబుకు పెద్ద చిల్లు పడింది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత మందుబాబులు అందుబాటు ధరలో నాణ్యమైన కిక్కు కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఐదేళ్లపాటు పిచ్చి బ్రాండ్లతో ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకున్న మందుబాబులకు కూటమి ప్రభుత్వం త్వరలోనే నాణ్యమైన కిక్కు ఇవ్వనుంది. మళ్లీ 2019కి ముందు రోజులు మందు బాబులు చూడనున్నారు. ప్రాణాలు మింగేస్తున్న జగన్ పిచ్చి బ్రాండ్లను తీసేసి గతంలో టీడీపీ హయాంలో మాదిరిగా నాణ్యమైన సరుకు తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ప్రకటించిన హామీ అమలుకు ఇప్పటికే కసరత్తు మొదలైంది. ప్రక్రియ అంతా సజావుగా పూర్తయితే అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది.

వైసీపీలో అంతా దోపిడీనే..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ దారుణమైన మద్యం పాలసీని అమలు చేసిన విషయం తెలిసిందే. జగన్ దెబ్బకు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రం నుంచి పరుగు పెట్టాయి. మద్యం తయారీ కేంద్రాలను(బ్రేవరీలు) వైసీపీ నాయకులు బలవంతంగా సొంతం చేసుకొని రోజుకో బ్రాండును జనాల్లోకి తెచ్చారు. పెద్ద కంపెనీలు జగన్‌కి భయపడి రాష్ట్రంలో అమ్మకాలనే మానేశాయి. ఎంసీ, నాకవుట్ బ్రాండ్ల పేరు విని ఐదేళ్లు గడిచిపోయింది. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇష్టానుసారం ధరలు నిర్ణయించుకోవచ్చని వైసీపీ ప్రభుత్వం జీవో ఇవ్వడంతో బార్లలో ఒక్కో బీరుపై ఎంఆర్పీపై రూ.100-150, క్వార్టరుపై రూ.70 వరకూ అదనంగా లాగేస్తున్నారు. వైసీపీ హయాంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర ఎంఆర్‌పీ ఎక్కువగా ఉండేది.

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఇలా..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ ఓ పద్ధతిగా ఉండేది. అప్పుడు క్వార్టరు(180ఎంఎల్) నాణ్యమైన సరుకు రూ.120కే దొరికేది.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ధరను అమాంతం రూ.200 చేసేశారు. 'జే' బ్రాండ్లతో షాపులను నింపేశారు. అమ్మకాలు ఎక్కువగా ఉన్న బ్రాండ్లకు మళ్లీ క్వార్టరుకు రూ.20.. తర్వాత రూ.10 అదనంగా తగిలించారు. ఇలా క్వార్టరు రూ.230 అయిపోయింది. సారా వల్ల ఆరోగ్యాలకు ఇబ్బంది కలుగుతోందని గ్రహించిన టీడీపీ పాలకులు చీప్ లిక్కర్‌ని అందుబాటులోకి తెచ్చారు.ఈ మందు ప్రమాణాల ప్రకారం డిస్టలరీల్లో తయారయ్యేది.అయినా దాని ధర మాత్రం రూ.60 మించలేదు. వైసీపీ ప్రభుత్వంలో రంగు సారా సీసాల్లో నింపి ధర రూ.150-180 చేశారు. టీడీపీ ప్రభుత్వంలో లైసెన్సు పొందిన మందు షాపులు ఉండేవి. ఎంఆర్పీపై ఒక్క రూపాయి కూడా అధికంగా వినియోగదారుల వద్ద నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే వ్యాపారస్తులకు కమిషన్ ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని తీసేసింది. అసలే ఎంఆర్పీ అధికమంటే దానిపై ఎంత ఎక్కువకైనా అమ్ముకోవచ్చంటూ బార్‌లకు ధరలను ధారాదత్తం చేస్తూ ఆదేశాలు ఇచ్చేసింది. దీంతో టీడీపీ ప్రభుత్వంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు బార్‌లో కొనాలంటే రూ.210 అవుతోంది. రోజంతా కష్టపడితే రూ.500 వస్తే గతంలో సుమారు రూ.400 ఇంటికి తీసుకెళ్లేవారు. వైసీపీ మద్యం పాలసీ వల్ల రూ.100 కూడా కొంపకు చేర్చడం కష్టమయ్యేది. దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి.

పిచ్చిబ్రాండ్లపై విజిలెన్స్

జగన్ ప్రభుత్వంలో నాసిరకం మద్యానికి చాలా మంది బలైపోయారు. లివర్, గుండె, ఉదర సంబంధిత, మతిమరుపు వ్యాధులు ఎక్కువయ్యాయి. వైసీపీ నాయకులు ఇష్టానుసారం మద్యాన్ని తయారు చేసేవారు. సాధారణంగా పెద్ద కంపెనీలు వారి సొంత ఫార్ములా ప్రకారం మద్యం తయారు చేస్తాయి. వైసీపీ నాయకులు అవేమీ పట్టించుకోకుండా కల్తీ మద్యాన్ని తాగించారు. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో మద్యం వల్ల అప్పటికే ఉన్న వ్యాధులు వేగంగా తీవ్రమై సుమారు 8 వేల మంది వరకూ మరణించారని తెలుస్తోంది. వీరిలో 600 మంది వరకూ నాసిరకం మద్యం తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్ పిచ్చి బ్రాండ్ల నిగ్గుతేల్చే పని ఆరంభించింది. దీనిలో భాగంగా ఈ నెల 21న జిల్లాలోని మూడు మద్యం తయారీ కేంద్రాల్లో విజిలెన్స్ అధికారులు సోదాలు చేశారు. కొవ్వవరంలోని బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ లిమిటెడ్ నుంచి 193, నల్లమిల్లిలోని ప్రాగ్ డిస్టిలరీస్ నుంచి 240, కోటపాడులోని పీఎంకే డిస్టిలరీస్‌లో 829 మద్యం నమూనాలను సేకరించింది. నిబంధనలు పాటించలేదని ప్రాథమికంగా అంచనా వేస్తూ మూడు కేసులు నమోదు చేశారు.ఆయా డిస్టిలరీల్లో తీసుకున్న నమూనాలను రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఆర్ఎఫ్ ఎస్ఎల్)కి పంపించారు. ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు హాని కలిగించే కారకాల ఆచూకీపై లోతుగా విశ్లేషణ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పిచ్చి బ్రాండ్లను పూర్తిగా నిర్మూలించి నాణ్యమైన మద్యాన్ని అందుబాటు ధరల్లో ఇవ్వడానికి సన్నా హాలు చేస్తోంది.వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీ ప్రకారం ప్రభుత్వ మద్యం దుకాణాల లైసెన్సులు సెప్టెంబరు వరకూ ఉన్నాయి. ఈలోపు మార్చడం కుదరదు. బార్ల లైసెన్సు ఇంకా ఏడాది ఉంది.ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని న్యాయపరమైన చిక్కులు రాకుండా కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే యోచన లో కూటమి పాలకులు ఉన్నారు.ఇప్పటికే ఎంసీ, సియా గ్రా మ్స్ వంటి కంపెనీలతో ఒప్పందాలకు ప్రయత్నాలు చేస్తు న్నట్టు చెబుతున్నారు.దీంతో ఐబీ, ఎంసీ బ్రాందీ వంటి సుమా రు 30 రకాల బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. జగన్‌కి భయపడి కనుమరుగైన నాకవుట్,బడ్వైజర్ వంటి బీర్లను మళ్లీ మందుబాబులకు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

కూటమి కొత్త పాలసీ

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చే కసరత్తు మొదలు పెట్టింది.దీనిలో భాగంగా మద్యం పాలసీపై అధ్యయనానికి రాజస్థాన్, యూపీ, తెలంగాణ, కేరళ, తమిళనా డు, కర్నాటక రాష్ట్రాలకు ఉన్నతాధికారుల బృందాన్ని పంపిం చాలని నిర్ణయించింది. అక్కడి బార్లు, మద్యం ధరలు, కొను గోళ్లు, నాణ్యత, చెల్లింపుల విధానం, ఆన్‌లైన్ పేమెంట్లు తదితర అంశాలపై ఈ నెల 12లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.దీని ప్రకారం సీఎం చంద్రబాబు నిర్ణయం తీసు కోనున్నారు. కొత్త మద్యం పాలసీ 2019కి ముందు ఉన్నట్లు రాబోతోందనే చర్చ నడుస్తోంది. దీంతో ధరలు కూడా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పట్లో ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకునేది. జగన్ వచ్చిన తర్వాత సెబ్ అంటూ కొత్త డిపార్ట్‌మెంట్‌ని సృష్టించి గజిబిజి చేసేశారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కి కోరలు పీకి కూర్చోబెట్టారు.



రేపటి నుంచి సత్యదేవుడి 134వ ఆవిర్భావ దినోత్సవాలు

అన్నవరం, ఆగస్టు 3: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి క్రోధినామసంవత్సర ఆవిర్భావ దినోత్సవాలు ఈనెల 5 నుంచి ప్రారంభమై రెండురోజులపాటు నిర్వహించనున్నారు. సత్యదేవుడు రత్నగిరికొండపై 1891 ఖరనామ సంవత్సరం శ్రావణశుద్ధ విదియ రోజున స్వామివారి ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్నుంచి ఏటా శ్రావణ శుద్ధ విదియరోజున ఆవిర్భావ దినోత్సవం జరపడం ఆనవాయితీ. దీనిలోభాగంగా 5వ తేదీ ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, కలశస్థాపన, దీక్షావస్త్ర ధారణలు చేపట్టి 6వ తేదీ వేకువజామున మూలవరులకు పంచామృతాభిషేకం, ఇతర పూజాధికాలు, పండిత సత్కారాలు జరగనున్నాయి. 11 గంటలకు జరిగే ఆయుష్యహోమ పూర్ణాహుతితో వేడుకలు ముగుస్తాయి. 6న అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటాన్ని సమర్పించనున్నట్టు పీఆర్వో కృష్ణారావు తెలిపారు.

7న ఉదయం నుంచి భీమేశ్వరస్వామివారి దర్శనం

ద్రాక్షారామ, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పురావస్తుశాఖ చేపట్టిన మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనులు పూర్తికావడంతో ఈనెల 7న ఉదయం 11.05 గంటల నుంచి భీమేశ్వరస్వామివారి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్టు ఈవో పి.టి.వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. 5న ఉదయం 8.05 గంటలకు సంకల్పం, అనంతరం పాడ్యమి మొదలు తదియ వరకు త్రయాహ్నిక దీక్షగా శ్రావణ శుద్ధ 7వ తేదీ ఉదయం 9.34 గంటల వరకు కళావాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పూజాధికాల అనంతరం ఉదయం 11.05 నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగా సుందరంగా అలంకరించారు. శనివారం ఆర్జిత సేవల ద్వారా రూ.1,22,817 ఆదాయం సమకూరిందని, స్వామివారిని 1,694 మంది దర్శించుకోగా, 1,205 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా గునుపూడికి చెందిన కుందుర్తి సింహాచలం దంపతులు రూ.10,700 విరాళంగా అందించారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.9.19 లక్షలు

ద్రాక్షారామ, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.9,19,057 ఆదాయం లభించింది. అన్నదాన ట్రస్టు హుండీ ద్వారా రూ.1,22,753 ఆదాయం సమకూరింది. శనివారం దేవాదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో పి.టి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది హుండీలను తెరచి కానుకలను లెక్కించారు. ఆళ్ల బుజ్జి, పెంకే సాయితేజ్, కలిదిండి వినాయకుడు, కర్రినాగేశ్వరరావు, అల్లం రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పతకాలు

మామిడికుదురు, ఆగస్టు 3: భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పలువురు విద్యార్థులు పతకాలు సాధించారని అంతర్జాతీయ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ తెలిపారు. నింజా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జూలై 26 నుంచి 28 వరకు జరిగిన బాక్సింగ్ పోటీల్లో జి.పావనిసాయిమహ (గెద్దాడ), ఎం.ప్రసీద (గూడపల్లి), సీహెచ్ అఖిల్ (మానేపల్లి), ఎస్కే నజ్రీన్ (రాజమహేంద్రవరం), వందన (అనంతపురం), ముఖేష్‌సాయియాద్ (తిరుపతి) బంగారు పతకాలు, అంతర్వేదిపాలేనికి చెందిన వై.దివ్యవాణి రజత పతకం సాధించినట్టు కోచ్ తెలిపారు. పతకాలు సాధించిన విజేతలను పలువురు అభినందించారు.




పాదగయలో పూజలు నిర్వహిస్తున్న కొణిదెల నిహారిక.. ఈవో, 'కమిటీ కుర్రాళ్లు' సినిమా యూనిట్ సభ్యులు

పాదగయలో మెగా హీరోయిన్ నిహారిక పూజలు

పిఠాపురం, ఆగస్టు3: పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని మెగా హీరోయిన్, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు కుమార్తె కొణిదెల నిహారిక సందర్శించారు. నిహారిక ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మితమైన 'కమిటీ కుర్రాళ్లు' సినిమా ఆగస్టు 9న విడుదల కానున్న నేపథ్యంలో మూవీ యూనిట్‌తో కలిసి ఆమె పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించారు. ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ నిహారిక తదితరులకు స్వామి, అమ్మవారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసానికి వెళ్లారు.

వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వే స్టేషన్



డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పురందేశ్వరి, గోరంట్ల, నల్లమిల్లి

- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వే స్టేషన్‌ని తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నామని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. రైల్వే స్టేషన్‌ని దాదాపు రూ.270 కోట్లతో అమృత్ భారత్ పథకంలో అభివృద్ధిచేయనున్న సంగతి తెలిసిందే. అయితే ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్ అవసరాల మేరకు ప్లాన్‌లో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని పురందేశ్వరి ఢిల్లీలో కలిసి వివరించారు. మార్పులపై స్పష్టమైన నివేదిక కోసం తమ అధికారులతో కలిసి రాజమండ్రి రైల్వే స్టేషను పరిశీలించాలని ఆయన సూచించారు. దాంతో వెంటనే పురందేశ్వరి శనివారం రాజమండ్రి చేరుకున్నారు. అమృత్ భారత్ స్కీం పనులను గతిశక్తి(రైల్వే బోర్డు) విభాగం చూస్తుండడంతో ఆ అధికారులు, విజయవాడ డివిజన్ అధికారులు కూడా హుటాహుటిన రాజమండ్రి చేరుకున్నారు. ముందుగా ప్లాన్‌ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా స్థానికంగా ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో రైల్వే ఉన్నతాధికారులు ఎంపీకి వివరించారు. ప్రస్తుత ప్లాన్‌లో రైల్వే పశ్చిమ వైపు ప్రధాన ద్వారం, ఐదు అంతస్తులు అధునాతన సదుపాయాలతో భవనం.. పశ్చిమ వైపు రెండు అంతస్తులతో భవనం నిర్మించాలని అనుకొంది. అయితే.. తూర్పు వైపు నగరం వేగంగా అభివృద్ధి చెందుతుండడం, 100 అడుగుల రోడ్డు రానుండడం వంటి వాటివల్ల ప్రధాన అభివృద్ధిని అటువైపునకు మార్చాలని ఎంపీ సూచించారు. తూర్పు వైపు నుంచి 1, 2, 3, 4, 5 ప్లాట్‌ఫాంలు వచ్చేలా మార్పు చేయాలని కోరారని తెలుస్తోంది. తర్వాత ఆమె రైల్వే స్టేషన్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని రైల్వే స్టేషన్‌ని అభివృద్ధి చేస్తామన్నారు. కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో మరికొన్ని రైళ్లను నిలపాలని కోరామన్నారు. వాటితోపాటు 2027 పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలని కోరగా మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని, ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పురందేశ్వరి అన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తూర్పు రైల్వేస్టేషను రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించామన్నారు. రైల్వే, మునిసిపల్ కార్పొరేషన్ సమన్వయంతో అభివృద్ధి చేస్తామన్నారు. హేవలాక్ వంతెనను పర్యాటకపరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామని వివరించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముడిసరుకుల దిగుమతులను దృష్టిలో ఉంచుకొని బిక్కవోలు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. కేశవరం దగ్గర ఆర్‌వోబీ ఏర్పాటు చేయాలని చెప్పగా భూసేకరణకు కృషి చేస్తామన్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల సూచనలను క్రోడీకరించి ఒక నివేదిక తయారు చేస్తామని డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ పేర్కొన్నారు. ఆ మేరకు రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి పనులు మొదలు పెడతామని చెప్పారు. రోడ్ కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలు నిషేధమని ఇప్పటికే అధికారులకు చెప్పామని ఆయన వెల్లడించారు. అనంతరం పురందేశ్వరి ఢిల్లీ వెళ్లారు. ఎస్ఎంఆర్ రంగనాథ్, డీఈఈ (మెము కార్‌షెడ్) ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్, ఎస్ఎస్ఈ(వర్క్స్) వల్లి, విజయవాడ డివిజనల్ అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.37.98 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వేళ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.37.98 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

లోవ క్షేత్రంలో వైభవంగా ఆషాఢ మాసోత్సవాలు

నేడు ఉదయం అమ్మవారికి నదీజలాలతో జలాభిషేకం

తునిరూరల్, ఆగస్టు 3: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి ప్రీతికరమైన రోజులు కావడంతో విశేష పూజలతోపాటు వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఆషాఢమాసంలో అమావాస్యకు ముందు ఏటా నిర్వహించే ప్రత్యేక పూజలు లోవ క్షేత్రంలో ప్రారంభమయ్యాయి. శనివారం తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం పూజలు నిర్వహించిన పండితులు ఆదివారం ఉదయం అమ్మవారికి సప్తనదీ జలాలతో అభిషేకించేందుకు ఏర్పాటు జరుగుతున్నాయని ఆలయ పండితులు రాణి శర్మ తెలిపారు. ఈ జలాభిషేక పూజల్లో భక్తులను భాగస్వామ్యం చేసే దిశగా ఏర్పాట్లు చేశామని, ఆదివారం జరిగే ఈ పూజలకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఐఎంఏ కాన్ఫరెన్స్ ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

వైద్య రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఐఎంఏ సదస్సులో మంత్రి దుర్గేష్

రాజానగరం, ఆగస్టు 3: వైద్యరంగంలో సంతరించుకుంటున్న ఆధునిక పరిజ్ఞానాన్ని నేటి వైద్యులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక వ్యవహారాలశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఐఎంఏ)ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సును శనివారం జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో వైద్య వృత్తిలో వస్తున్న నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుంటే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించగలరన్నారు. సభాధ్యక్షుడు, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంజేసీ నాయుడు మాట్లాడుతూ ఏపీ శాసనమండలిలో వైద్యులకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి విన్నవించారు. అలాగే డాక్టర్లపై ఒత్తిడి పెంచేలా రూపుదిద్దుకున్న 2008 సంవత్సరంలో రూపుదిద్దుకున్న 11వ చట్టంలో సవరణలు, క్లినిక్స్ నర్సింగ్ హోమ్ రిజిస్ట్రేషన్లకు సింగిల్ విండో ఏర్పాటు అవసరమని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ వైద్యరంగం తరపున కనీసం ఒక వైద్యునికైనా ఎమ్మెల్సీ అవకాశం కల్పించేలా ప్రభుత్వాన్ని కోరనున్నామని బదులిచ్చారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ సహా తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన 500మందికి పైగా జనరల్ సర్జన్లు పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్, రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ డాక్టర్ వై.గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ పి.విజయభాస్కర్ తదితరులు మాట్లాడారు. ఐఎంఏ డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పీఎస్ శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ తదితరులు నిర్వాహకులుగా ఉన్నారు.



వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అత్యవసర సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఎస్సీ వర్గీకరణను ఒప్పుకోం

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు.. మాలమహానాడు రద్దుచేసి వీవీపీఎస్‌లోకి రండి

రాజమహేంద్రవరంలో అత్యవసర సమావేశం : స్టేట్ కన్వీనర్ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు3: వర్గీకరణ చేస్తే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల పతనం తప్పదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈట్‌అండ్‌ప్లే కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన అత్యవసర మాలల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హర్షకుమార్ నేతత్వంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటైంది. దేశంలో మాలమాదిగలను విడదీసేందుకు ఓటు బ్యాంక్ రాజకీయాలకు పెద్దకుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఒక్కసారిగా జాతికి జరుగుతున్న అన్యాయంపై చాలా బాధ కలిగిందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్న వారిలో సమాజంలో అగ్రవర్ణాలతో సమాన స్థాయికి ఎదిగిన వారిని తొలగించడం కాని లేదా దారుణస్థితిలో ఉండి రిజర్వేషన్లు పొందని వారిని తిరిగి చేర్చడంకాని చేసే అధికారం రాష్ట్రపతి, పార్లమెంట్‌కు ఉంటుందన్నారు. అయితే విభజించాలంటే పార్లమెంట్‌లో అమెండ్‌మెంట్ చేసి మెజార్టీ తీర్మానం చేయాలని దాని ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఉంటుందన్నారు. కానీ ఏడుగురు జడ్జిల ధర్మాసనం ఏకపక్షంగా తీర్పునివ్వడం దారుణమన్నారు. ఇందులో న్యాయమూర్తి త్రివేది ఈ తీర్పును వ్యతిరేకించారని చెప్పారు. మాలమాదిగలను విడదీసి భవిష్యత్‌లో రిజర్వేషన్లు ఎత్తివేయాలనే కుట్ర దాగి ఉందన్నారు. అందుకే వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. మాలమహానాడు, సంఘాలను రద్దు చేసుకుని అందరూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలన్నారు. మల్లెల వెంకట్రావు ఢిల్లీలో సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలు చేసే పనిలో ఉన్నారని, తాను కూడా న్యాయపోరాటం చేస్తానన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాలలు కదలకపోతే తీవ్రంగా నష్టపోతామన్నారు. విధివిధానాలు లేకపోయినా అప్పుడే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తామని ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లోగాని వర్గీకరణ జరిగితే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చూస్తారని హెచ్చరించారు. లీగల్ కమిటీ, యువజన కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయా నాయకులకు హర్షకుమార్ సూచించారు. తెలంగాణ మాల సంఘాల నేతలు టి.రవి (మిర్యాలగూడ), బాలస్వామి (నాగర్‌కర్నూల్), అనిల్‌కుమార్ (పాలమూరు), డాక్టర్ మునిబాబు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంబటి కొండలరావు, బి.చంద్రయ్య (ప్రకాశం), వెంకటేశ్వరరావు (అనకాపల్లి), మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బెన్నయ్య, అరుణకుమారి (గుంటూరు), జ్యోతి మేరి, ఈశ్వరి (ఎన్‌టీఆర్ జిల్లా), జంగా బాబూరావు, జీవీ శ్రీరాజ్, రఘుబాబు మాట్లాడారు. మాల ఉద్యోగుల సంఘం స్టేట్ కన్వీనర్‌గా భరత్‌భూషణ్‌ను ప్రకటించారు. అనంతరం ఐదు తీర్మానాలు చేశారు. ఐకమత్యంలో ఉద్యమించాలని, ఉభయతెలుగు రాష్ట్రాల్లో అన్ని మాల సంఘాలను రద్దు చేసి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని, వర్గీకరణ ఉద్యమానికి మాల ఉద్యోగులు పూర్తి సపోర్టుగా ఉండాలని, లీగల్ కమిటీ గైడెన్స్‌లో న్యాయపోరాటం చేయాలని, ప్రతి జిల్లాలో ఇద్దరు.. ముగ్గురిని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి స్టేట్ కమిటీలో సభ్యులుగా ఉంచాలని, స్టేట్ కన్వీనర్‌గా హర్షకుమార్‌నే నిర్ణయిస్తూ సమావేశం తీర్మానాలు చేసింది.



వరద నీటి నుంచి బయటపడిన డ్రెడ్జింగ్ నావ

పెదబ్రహ్మదేవంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం

యువకుడికి దేహశుద్ధి.. ఇరువర్గాలపైనా కేసులు



అజయ్

సామర్లకోట, ఆగస్టు 3: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలో ఒక సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడన్న ఫిర్యాదుపై గ్రామానికి చెందిన చాపల అజయ్ యువకుడిని ప్రోత్సహించారన్న నేరంపై నలుగురు వ్యక్తులపైనా ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇదే సంఘటనలో దళిత యువకుడిపై ఏడుగురు వ్యక్తులు దౌర్జన్యంచేసి గాయపర్చారన్న రెండోవర్గం చేసిన ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. గ్రామంలో ఈ ఘటనతో శాంతిభద్రతలు అదుపుతప్పకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా గ్రామంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. రాత్రికి నిరంతరం పోలీసు పికెట్ ఉంచేలా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామానికి చెందిన మైనర్ బాలిక కాకినాడ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా అదేగ్రామానికి చెందిన దళిత యువకుడు తాను ప్రేమిస్తున్నానని వెంటబడుతుండడమేగాక ఈ నెల 1న సదరు బాలికను కిడ్నాప్‌చేసి 2న గ్రామంలో బస్టాండ్ వద్ద విడిచిపెట్టినట్టు సమాచారం. కాగా శనివారం అజయ్ మోటార్ సైకిల్‌పై బాలిక ఇంటికి చేరుకుని అత్యాచారయత్నానికి పాల్పడడంతో బాలిక కేకలకు కుటుంబసభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని యువకుడికి దేహశుద్ధి చేశారు. బాలిక, తాను గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నామని యువకుడు పోలీసులకు చెప్పగా తాను ఈనెల 1న బాలికను కాకినాడ తీసుకెళ్లినట్లు అంగీకరించినట్లు సమాచారం. అయితే యువకుడి చేతులుకట్టి కొట్టికిందపడవేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో ఉదయం నుంచీ వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, సామర్లకోట సీఐ అంకబాబు తదితర పోలీసులతో కలిసి సంఘటనా స్థలి అయిన పెదబ్రహ్మదేవం చేరుకున్నారు. అప్పటికే గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల నుంచి వాస్తవసమాచారాన్ని సేకరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు అజయ్ వాంగ్మూలం కూడా పోలీసులు సేకరించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు రెండు వైపులా కేసులు నమోదు చేసినట్టు సామర్లకోట పోలీసులు శనివారం రాత్రి చెప్పారు. గాయపడిన అజయ్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రాణాపాయం ఏమీలేదని గ్రామంలో పోలీసుపికెట్ కొనసాగుతుందన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాజమహేంద్రవరంరూరల్, ఆగస్టు3: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు సచివాలయం-3లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విప్పర్తి నిఖిల్ కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ ఉదయం 5 గంటల నుంచే పంపిణీ చేపట్టాలంటూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అయితే నిఖిల్‌కృష్ణ 10 గంటల వరకు లాగిన్ ఓపెన్ చేయకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేశారు. ఈ సంఘటన ఈనెల 1న జరిగింది. సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ తండ్రి జిల్లా పరిషత్ ఛైర్మన్ కావడంతో సంబంధిత అధికారులు విషయాన్ని బయటకు రానీయకుండా గోప్యంగా ఉంచినట్టు తెలిసింది. ప్రతీ సమాచారాన్ని తెలిపే డీపీఆర్‌వో ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచడం విమర్శలకు దారితీసింది.

గోదావరిలో దూకిన వ్యక్తి కోసం గాలింపు

పి.గన్నవరం, ఆగస్టు 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి శనివారం గుర్తు తెలియని వ్యక్తి దూకడంతో వరదనీటిలో గల్లంతయ్యాడు. కొత్త అక్విడెక్టుపై చెప్పులు వదిలి గోదావరిలో దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అతడు దూకే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ వచ్చే ప్రయత్నం చేయగా, అప్పటికే నీటిలో దూకేసినట్టు చెప్పారు. కొత్త అక్విడెక్టుపై నుంచి దూకిన వ్యక్తి పాత అక్విడెక్టు దాటేవరకు కనిపించాడని గోదావరిలో గేలం వేస్తున్న వ్యక్తులు చెప్పారు. తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్, అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి, ఏఎస్ఐ ఎస్.పట్టాభిరామయ్య, ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహరావులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఉడిమూడిలో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని సంఘటనా స్థలానికి రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆ వ్యక్తి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు.

వరద నీటి నుంచి బయటపడిన డ్రెడ్జింగ్ నావ

ధవళేశ్వరం, ఆగస్టు 3: కాటన్ బ్యారేజ్ గేటుకు అడ్డంగా మునిగిన డ్రెడ్జింగ్ నావ గోదావరి నీటిమట్టం తగ్గి నీటి నుంచి బయటకు కనిపిస్తుండడంతో శనివారం బయటకు తీయడానికి నావ యజమానులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నావకు ఐరన్ రోప్‌లు కట్టి కప్పీల సహాయంతో ఆ ప్రాంతం నుంచి ఒడ్డుకు లాగడానికి చేసిన ప్రయత్నాల్లో బలమైన ఇనుప రోప్ సైతం తెగిపోయింది. నావ దిగువ భాగం బురదలో దిగబడిపోవడంతో బయటకు లాగడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వరద ఉధృతికి గాయిత్రి ఇసుక ర్యాంప్ వద్ద లంగరు వేసిన డ్రెడ్జింగ్ నావ గత నెల 25న కాటన్ బ్యారేజ్ వద్దకు కొట్టుకు వచ్చి 1వ నెంబరు గేటుకు అడ్డంగా మునిగిపోయింది. ప్రస్తుతం నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారిన నావను బయటకు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం మరింత పకడ్బందీ ఏర్పాటుతో నావను బయటకు లాగడానికి జరుగుతున్న ఏర్పాట్లు బ్యారేజ్ ఏఈఈ నాగలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.50 అడుగులు

రాజమహేంద్రవరం, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద బాగా తగ్గుతోంది. జూలై 19వ తేదీ నుంచి పెరగడం మొదలెట్టిన వరద గోదావరి పెరుగుతూ, తగ్గుతూ, మళ్లీ పెరుగుతూ వచ్చిన సంగతి తెలిసిందే. కానీ రెండు రోజుల నుంచి బాగా తగ్గుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు నీటిమట్టం 8.50 అడుగులుగా ఉంది. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 5,81,417 క్యూసెక్కులు వరద ప్రవాహం వెళుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి పాండ్ లెవల్ 13.26 మీటర్లుగా ఉంది. గోదావరి డెల్టా కాలువలకు 8,800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం సాయంత్రం 5 గంటలకు 33.90 అడుగులకు చేరింది. కాగా ఎగువ భాగంలో వర్షాలులేవని అధికారులు చెబుతున్నారు. కాళేశ్వరం వద్ద స్వల్పంగా పెరుగుతుండగా ఆ ప్రభావంతో భద్రాచలం వద్ద 33.10 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం నిదానంగా పెరుగుతూ శనివారం రాత్రి 7 గంటలకు 34.10 అడుగులకు చేరింది. భద్రాచలంలో ఇక పెరుగుదల లేకపోతే మొత్తం వరద లాగేస్తుంది. పొలాలు, డ్రైన్లలోని నీరు కూడా దిగిపోతుంది. వరి రైతులు తిరిగి మళ్లీ వెదజల్లే పద్ధతిలో సాగుకు వెళతారా, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటారా అనేది తేలనుంది.

ఏజెన్సీ సమాచారం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం : ఐటీడీఏ పీవో



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం ఆగస్టు 3: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని గిరిజన తెగల నాయకులతో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. శనివారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో గిరిజన తెగల నాయకులు, అధికారులతో ఆయన ఆదివాసీ దినోత్సవానికి ముందస్తు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పీవో కట్టా సింహాచలం మాట్లడుతూ గిరిజన తెగల్లో భేదాభిప్రాయలు లేకుండా పార్టీలకు అతీతంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవచ్చని, అలాగే అందరూ సంతోషంగా ఉండాలన్నారు. గిరిజన తెగల కులపెద్దలకు సముచిత ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున వేదికపైకి ఒక్కొక్క తెగ నుంచి ఇద్దరు నాయకులను ఆహ్వానిస్తామన్నారు. సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లడుతూ ఏజెన్సీలోని గిరిజనుల అభివృద్ధికి మిషన్‌ప్లాన్ తయారుచేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన ఎంపీటీసీ వెంకటరమణ

మోతుగూడెం: రంపచోడవరం ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన కట్టా సింహాచలంను డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 9న జరగనున్న ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో రంపచోడవరం డివిజన్‌లోగల 7 మండలాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాలతో గిరిజనాభివృద్ధి-సంక్షేమంపై అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ కలిసి పలు సమస్యలపై విన్నవించారు.

మన్యంలో కూంబింగ్

● మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల కట్టడికి తనిఖీలు

మోతుగూడెం, ఆగస్టు 3: చింతూరు ఎస్పీ అమిత్‌బర్దర్, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు కట్టడి చేసేందుకు సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలతో డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తెలిపారు. జూలై28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాలు ప్రకటించిన నేపథ్యంలో వారోత్సవాలను, మావోయిస్టుల యాక్షన్‌ప్లాన్‌లను భగ్నం చేసేందుకు మన్యం ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మావోయిస్టులు తిరుగుతున్న అనుమానాస్పద ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ బలగాలతో జల్లెడ పట్టినట్లు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'పల్లా'ను కలిసిన టీడీపీ నాయకులు

ఎటపాక, ఆగస్టు 3 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శనివారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎటపాక టీడీపీ నాయకులు కలిశారు. ఈమేరకు పలు సమస్యలను అధ్యక్షుడు పల్లా దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి నదికి ఆనుకుని ఉన్న ఎటపాకలో కరకట్ట నిర్మాణం చేపట్టాలని, గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల మంజూరు చేయాలని, వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ లైన్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన రాష్ట్ర అధ్యక్షుడు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని హామీ ఇచ్చినట్లు టీడీపీ సీనియర్ నాయకులు కిలారు వెంకన్న, నలజాల శ్రీకాంత్ తెలిపారు. టీడీపీ నాయకులు పాటి చలపతిరావు, పాటి సంపత్, ఐటీడీపీ చాంపియన్ బాచినేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

చింతలగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఎటపాక, ఆగస్టు3: మండలంలోని చింతలగూడెం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం పొలం పిలుస్తోంది. కార్యక్రమంను నిర్వహించారు. ఏవో రాబిన్ వరినాట్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిం చారు. వరినాట్లు వేసే సమయంలో వరినారు కొనలను తుంచడంవల్ల కాండం తొలుచు పురుగు నివారణ, పురుగుతీవ్రత తగ్గించడం, రైతులకు కాలి బాటల వలన కలిగే ఉపయోగాలను వివరించారు. జీవన ఎరువు సుడో మోనస్ ఉప యోగించడం వల్ల పంట ఉపయోగాలను వివరించారు. వరినాట్లు వేసే సమ యంలో అరగంటసేపు మిశ్రమంలో ఉంచడంవల్ల కలిగే లాభాలను వివరించారు.

తునికాకు సేకరణ సొమ్ములు చెల్లించాలని వినతి

ఎటపాక, ఆగస్టు3: ఈ ఏడాది తునికాకు సేకరణ కట్ట సొమ్ములు చెల్లించాలని శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నెల్లిపాక ఫారెస్ట్ అధికారికి వినతి పత్రంను అందజేశారు. తునికాకు కట్ట సొమ్ములు, ఉపాధిహామీ వేతనాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని, పెడింగ్ సొమ్ములు చెల్లించాలని కోరారు. 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ సొమ్ములు కూడా చెల్లించాలని కోరారు. ఫారెస్ట్ ఆఫీసర్ స్పందిస్తూ బకాయి వేతనాలు విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీపీఎం మండల కార్యదర్శి ఐవీ తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకా అర్జున్‌దొర, బుద్దల భద్రయ్య, ఇరపా సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నాయకులు

దేవీపట్నం, ఆగస్టు 3: మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో శనివారం దేవీపట్నం టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబును కలిశారు. దేవీపట్నం మండలంలో ముంపునకు గురవుతున్న పోలవరం 44 గ్రామాల నిర్వాసితుల సమస్యలపై దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో సీఎంకు వినతిపత్రం అందజేశారు. దేవీపట్నం పునరావాస కాలనీ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వివాదంలో 9ఎకరాల ఇళ్ల స్థలాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామాలను ఖాళీ చేసే సమయానికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అర్హులుగా గుర్తించాలని తదితర డిమాండ్లు సీఎంకు వివరించారు. ఈ లంక హరిబాబు, గేదెల చినసుబ్బారావు, దొడ్డ సింహాద్రి, సిద్ద నాని ఉన్నారు.

రైతులకు జీడిమామిడి మొక్కల పంపిణీ

రంపచోడవరం, ఆగస్టు 3: మండలంలోని ముసురుమిల్లి పంచాయతీలో సర్పంచ్ కోసు రమేష్‌బాబు, ఎంపీటీసీ వంశీ కుంజం శనివారం లబ్ధిదారులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జీడిమామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో సకాలంలో మొక్కలను నాటుకో వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో సత్యనారా యణ, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్, వీహెచ్‌ఏ చంద్రకుమార్, బొబ్బా శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రంపచోడవరం, ఆగస్టు 3: స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల విద్యార్థులు 2022-24 విద్యా సంవత్సరానికిగాను 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చినబాబు తెలిపారు. మొత్తం 36 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 36మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు. కుంజం దివ్య 2549 మార్కులతో ప్రథమస్థానం, నర్సి శివ 2510 మార్కులతో ద్వితీయస్థానం, మడి పోసిబాబు 2504 మార్కులతో తృతీయస్థానం కళాశాలలో టాపర్‌గా నిలిచారన్నారు.

జామాయిల్ కర్రకు రైతులందరికీ ఒకే ధర ఇవ్వాలి

కూనవరం, ఆగస్టు 3: సారపాక ఐటీసీ పేపర్‌బోర్డుకి ముడిసరుకు అయిన జామాయిల్ కర్రను ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క రేటును ఇస్తూ కంపెనీ రామెటీరియల్ యాజమాన్యం రైతులను మోసం చేస్తుందని జామాయిల్ కర్ర రైతులు తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో రైతులు మాట్లాడారు. సారపాక కంపెనీ ఆంధ్రా నుంచి వచ్చే కర్ర కంటే తెలంగాణ నుంచి వచ్చే కర్రకు అధిక ధర ఇస్తున్నారని ఆరోపించారు. జామాయిల్ కర్ర రైతులందరికీ ఒకే న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎడవల్లి భాస్కరరావు, బరపాటి ప్రకాశరావు, ఉమామహేశ్వరరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

'మోటారును తొలగించాలి'

ఎటపాక, ఆగస్టు 3: ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీ అపకావారి గిరిజన గుంపులోని పబ్లిక్ చేతి పంపును గత ఐదేళ్లుగా స్థానిక వైసీపీ సానుభూతిపరుడు ఒకరు సొంత మోటారు అమర్చి, పంటల సాగునీటికి వినియోగిస్తున్నారు. ఆ గుంపులోని పబ్లిక్ చేతిపంపు పైభాగాలను తొలగించి, దానికి సొంత మోటారు అమర్చి, పంటల సాగునీటి మోటారుగా మార్చాడు. అప్పుడు స్థానికులు ఏమీ అనలేని పరిస్థితి ఉండేది. ప్రభుత్వం మారడంతో స్థానికులు పబ్లిక్ చేతిపంపును సొంతానికి వాడడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో స్థానిక గ్రామసెక్రటరీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు రెండునెలల నుంచి ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. సదరు వైసీపీ సానుభూతిపరుడు మోటారు వేసినప్పుడే నీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

ప్రజావాణిలో వెల్లువెత్తిన అర్జీలు

● కూటమి ఎమ్మెల్యేకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే వినతిప్రత్రం

సీతానగరం, ఆగస్టు 3: ప్రజావాణి కార్యక్రమలో ప్రజల నుంచి భారీగా అర్జీదారులు పాల్గొని వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సాదాసీదాగా మండల కార్యాలయం బయట కుర్చీ వేసుకుని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై పూర్తి కాని పనులను పూర్తిచేయాలని, 2019-24 మధ్య గత ప్రభుత్వ హయాంలో నియోజక వర్గంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. గతంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు వచ్చిన లోకేష్‌పై దాడికి యత్నించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కోరుకొండ నుంచి ముగ్గళ్ల వరకు, బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు వేసిన రోడ్డు వెడల్పు పనులలోను ఇంటి స్థలా ల మెరక పేరుతో తీసుకువచ్చిన మట్టిలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. శనివారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జగనన్న సమగ్ర భూసర్వేలో భూములు పోయిన రైతులు తమ రికార్డుల ప్రకారం భూమి మాకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తులు వెల్లువెత్తాయి. చినకొండేపూడి మాజీ సహకార సంఘం అధ్యక్షుడు వడ్లమూరు సోమరాజు, తదితరులపై అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పెట్టించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సోమరాజు తదతరులు ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జడ్పీటీసీ చల్లమళ్ళ వెంకటలక్ష్మి, వైసీపీ నాయకులు చల్లమళ్ళ సుజిరాజు, మదన్‌మోహన్ టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఎమ్మెల్యే బత్తులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెందుర్తి

అనపర్తి రైల్వే సమస్యలపై డీఆర్‌ఎంతో చర్చించిన నల్లమిల్లి

సానుకూలంగా స్పందించిన డీఆర్‌ఎం నరేందర్ ఏ పాటిల్



రైల్వే డీఆర్‌ఎంకు అనపర్తి రైల్వే సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి ఆగస్టు 3 : రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన రైల్వే డీఆర్ ఎం నరేందర్ ఏ పాటిల్‌ను ఎంపీ పురందేశ్వరితో పాటు కలిసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి రైల్వే సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఉదయం 10గంటల తరువాత విశాఖపట్నం వెళ్లేందుకు ఒక్క రైలు కూడా సాయంత్రం వరకు లేకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను డీఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్ళారు. అదేవిధంగా అనపర్తిలో మూతపడ్డ 413 రెల్వేగేటు స్థానంలో ఫుట్ పాత్ బ్రిడ్జి నిర్మాణానికి 3.75కోట్ల నిదులతో ప్రతిపాదనలు పంపగా 2019లో ఏపీలో ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో మంజూరైన పనులు నిలిచిపోయాయని డీఆర్‌ఎంకు వివరించడంతో ఆయన సానుకూలంగా స్పందించి అక్కడ పరిస్థితిని రైల్వే అధికారులతో కలిసి పరిశీలించి నివేదించాలని ఆర్‌అండ్‌బీ ఈఈని ఆదేశించారు. అదేవిధంగా కెనాల్ రోడ్డులో కేశవరంవద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆవశ్యకతను డీఆర్‌ఎంకు వివరించగా రాష్ట్ర ప్రభుత్వం స్థల సేకరణ చేస్తే రైల్వేశాఖ పూర్తి నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు సిద్ధంగా ఉందని డీఆర్‌ఎం తెలిపినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి మీడియాకు తెలిపారు.



ప్రస్తుత ఉపాధ్యాయులతో ఆనాటి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ధవళేశ్వరం, ఆగస్టు 3: 50 సంవత్సరాలు సుదీర్ఘ సమయం తరువాత పదో తరగతి చదివిన విద్యార్థులు అదే స్కూల్‌వేదికగా తిరిగి కలుసుకున్నారు. సర్ ఆర్థర్ కాటన్ బాలుర పాఠశాలలో 1973-74లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం తిరిగి కలుసుకున్నారు. తమతమ ఉద్యోగ విధుల నుంచి రిటైర్డ్ మనువులు, మనువరాళ్లతో గడుపుతున్న సమయంలో చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఒకరిని ఒకరు గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తూ సంబరాశ్చర్యాలకు లోనయ్యారు. ఆత్మీయ ఆలింగనాలు చేసుకుని ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. వారివారి కుటుంబాల గురించి ఒకరికొకరు తెలియజేసుకున్నారు. క్లాసురూముల్లో కూర్చుని మరలా విద్యార్థులయ్యారు. ఆనాడు విద్యను బోధించిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం స్కూల్లో విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. సాయంత్రంవరకు ఆడుతూపాడుతూ గడిపి ఆనుభూతులను మదినిండా నింపుకుని వెనుదిరిగారు.

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణం

అనపర్తి, ఆగస్టు 3 : రాయవరం మండలం లొల్ల గ్రామంలో బీజేపీ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం నిర్వహించిన సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరి ంచారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవించాలి

● నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు



నన్నయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 3: పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమ్మపేరుమీద ఒక మొక్క నాటాలని, పర్యావరణహితంగా జీవించాలని ఆదికవి నన్నయ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్.విభాగం సౌజన్యంతో అమ్మపేరు మీద ఒక మొక్కను నాటే (ఏక్‌పేడ్ మామ్ కే నామ్) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వీసీ బంగ్లా ప్రాంగణంలో ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, ప్రిన్సిపాల్లు ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, కూటమి నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి. అడబాల గణపతిరావు, రజనీ, ఎం.సత్తిబాబు, పి.నారాయణస్వామి, జాన్, గౌతమి, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఎన్.ఎస్.ఎస్.పీవోలు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు,

వేమగిరిలో వన సంరక్షణ ర్యాలీ

కడియం, ఆగస్టు 3: కడియం మండలం వేమగిరిలో శనివారం వన సంరక్షణ ర్యాలీ జరిగింది. మొక్కలు పెంచుదాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అన్నారు. ర్యాలీ అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ వాసంశెట్టి నాగబాబు, అప్పారి అన్నవరం, జోగి చక్రవర్తి, బృందావన్ హెల్పింగ్ హ్యాండ్స్ నవీన్, పిరమిడ్స్ మాస్టర్ రాయ జగపతిరాజు, మట్టపర్తి రావణ్, రేలంగి నారాయణరావు, మోహన్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



వేమగిరిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రదర్శన

గోకవరం, ఆగస్టు 3: గోకవరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారంటూ ప్రదర్శనకారులు వాపోయారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ గోకవరం నుంచి వెళ్లి డిగ్రీ చదవాలంటే సుమారు 30కిలోమీటర్లు దూరంలో ఉన్న రాజమహేంద్రవరం, రంపచోడవరం, జగ్గంపేట, తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీనివల్ల తల్లిదండ్రులకు ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ఈవిషయంలో కూటమి నాయకులు సహకరించి గోకవరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రదర్శనకారులు విజ్ఞప్తి చేశారు.



డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలంటూ ప్రదర్శన నిర్వహించిన పీడీఎస్‌యు సంఘ సభ్యులు

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం

● కేవీకేలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

రాజానగరం, ఆగస్టు 3: తల్లి పాలతో పుట్టిన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కృషివిజ్ఞాన కేంద్రంలోని గృహవిజ్ఞాన విభాగం సబ్జెక్టు మేటర్ స్పెషలిస్ట్ సంజయ్‌హెగ్డే అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కలవచర్ల కృషివిజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది సహకారం తో మహిళలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, తల్లి పాల ఆవశ్యకత అనే అంశాలపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెగ్డే మాట్లాడుతూ తల్లి పాల లో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు సరైన నిష్పత్తిలో లభిస్తాయన్నారు. మరో ముఖ్యఅతిథి కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తిని పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో రఘు నందన్, జె.ప్రభాత్‌నాయుడు, కేవీకేలో శిక్షణ పొందుతున్న విజయవాడ మారిస్ స్టెల్లా కళాశాలకు చెందిన వ్యవసాయ విద్యార్థినులు, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

● గార్డ్స్ ఫర్ ఆర్టీఐ జాతీయ కన్వీనర్ వరదా

కడియం, ఆగస్టు 3: ప్రతీఒక్కరూ విద్యార్థి దశనుంచి ప్రశ్ని ంచే తత్వాన్ని అలవర్చుకోవాలని గార్డ్స్‌ఫర్ ఆర్టీఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు తెలిపారు. కడియం ఉన్నత పాఠశాలలో ఆర్టీఐ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం అన్నారు. మహిళా కన్వీనర్ ఆకుల భారతి, న్యాయవాది తోరాటి వసంతరావు, మహిళా న్యాయవాది శిరీష, ముద్దాల అను, ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ, ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, దామిశెట్టి నాగరాజు తదితరులు మాట్లాడారు. అనంతరం గార్డ్స్ ఫర్ ఆర్టీఐ మండల కమిటీ నియామకం జరిగింది.

ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● జూనియర్ సివిల్ జడ్జి వంశీకృష్ణ



న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిస్తున్న అనపర్తి జూనియర్ సివిల్ జడ్డి వంశీకృష్ణ

అనపర్తి, ఆగస్టు 3 : ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ముఖ్యంగా విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.వంశీకృష్ణ అన్నారు. శనివారం అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడపాటి రవిషణ్ముఖరెడ్డి అధ్యక్షతన జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలిసిచేసినా తెలియక చేసినా తప్పు తప్పేనని అందుకే తప్పులు జరగక ముందే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. విద్యా ర్థులు అన్ని సబ్జెక్టులతోపాటు న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, న్యాయవాదులు టీవీవీ రమణమూర్తి, ఆర్‌వీజీ పట్నాయక్, మన్మోహన శ్రీనివాసరెడ్డి, శ్రీదర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, బులిరెడ్డి, సుధాకరరెడ్డి, ఏఎస్ఐ వీర్రాజు, కోర్టు వీసీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మదుగులమ్మకు ఘనంగా సారె మహోత్సవం

బిక్కవోలు, ఆగస్టు 3: బిక్కవోలు గ్రామ దేవతగా పూజలందుకుంటున్న మదుగులమ్మ అమ్మవారికి శనివారం ఘనంగా సారె మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులతో పాటు వంద రకాల స్వీట్లతో గ్రామోత్సం నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఈ సారెను భక్తులకు ప్రసాదంగా అందించారు.

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు 130 మంది ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 182 మంది విద్యార్థులు హాజరుకాగా 130 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. జాబ్ మేళాలో 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై విద్యార్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారని కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. ప్లేస్‌మెంట్ ట్రైనర్ కిరణ్‌కుమార్, కిరణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుమర్తి చిన్నా మాదిగ

హర్షకుమార్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలి

మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఆకుమర్తి

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 3: అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలను మానుకోవాలని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఆకుమర్తి చిన్నామాదిగ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ హర్షకుమార్ రాజకీయ నిరుద్యోగి అని, మాలలను వంచించి తన స్వార్థ ప్రయోజనాల కోసం అమాయక మాలలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అంశం ఇప్పటిది కాదని 1965లోనే లాల్‌బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో లోకూర్ కమిషన్ వేశారని గుర్తు చేశారు. 1977నుంచి మాదిగలు ఏ ప్రభుత్వం వచ్చినా తమకు జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారని చెప్పారు. 1994కు ముందే కాంగ్రెస్ నాయకులు సదాలక్ష్మి, నంది ఎల్లయ్య మందా జగన్నాథం అనేక సభలు పెట్టి మాదిగలకు రిజర్వేషన్లు ఫలాలు అందడంలేదని ఉద్యమం చేశారని చెప్పారు. ఆ ఫలితంగానే 1996లోటీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకుని 1997లో ఎస్సీవర్గీకరణ అమలు చేశారని వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకులేదని హైకోర్టుకు కొట్టివేసిందన్నారు. అటుపై 2000లో అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి రాష్ట్రపతి ఆర్‌కే నారాయణ ఆధ్వర్యంలో ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణ అమలు చేశారన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తున్నామన్నారు. అనంతరం టీడీపీ నాయకులు కోరుమిల్లి విజయశేఖర్, చాపల చిన్నరాజు, ఎమ్మార్పీఎస్ నాయకుడు దొండపాటి కృష్ణాఫర్ మాట్లాడారు. వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల అలుపెరుగని పోరాటం చేశారని గుర్తుచేశారు. అన్నిరాష్ట్రాల అసెంబ్లీల్లోను వర్గీకరణ తీర్పును అమలుచేయాలన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఇది అట్టడుగు వర్గాల ప్రజల విజయమని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర నాయకురాలు పి.టాన్యా పేర్కొన్నారు. శనివారం మావో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సుప్రీం ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం స్వాగతించి పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలన్నారు. తక్షణమే కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రిజర్వేషన్లలో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.భాను ప్రసాద్ పాల్గొన్నారు.

108 ఉచిత శ్రీనివాస కళ్యాణోత్సవాలు



అమ్మఒడి సేవా తరంగిణి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరంకల్చరల్, ఆగస్టు 3: అమ్మఒడి సేవా తరంగిణి స్థాపించి 12 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలో 108 ప్రాంతాల్లో 108 ఆలయాలవద్ద 108 ఉచిత శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు జరిపించాలని నిర్ణయించినట్లు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం సేవా తరంగిణి చేపట్టిన ఈ 108 కల్యాణాలకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం కల్యాణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యదర్శి విజయస్వామి మాట్లాడుతూ, 99890 32311, 85200 34741కు కాల్‌చేసి, దరఖాస్తును పొంది ఈ నెల 31లోగా పూర్తి చేసి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో దొడ్డా వెంకటకృష్ణ, అజ్జరపు రమేష్, యు.బంగార్రాజు, ఎల్.శ్రీసాయి, భరద్వాజ్‌కుమార్, ఎం.శ్రీదేవి, పి.హేమలత, జ్ఞానేశ్వరి, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3: జనసేన కార్యకర్తలు, అభిమానులు పార్టీ క్రియాశీల సభ్యత్వం నమోదు చేయించుకోవాలని పార్టీ రాజమహేంద్రవరం ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. స్థానిక నందం గన్నిరాజు జంక్షన్‌లో జనసేన నాయకుడు బయ్యపునీడి సూర్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రియాశీల సభ్యత నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని సభ్యత్వ నమోదు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల్ని వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు బోల్తా

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
● ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

రాజానగరం, ఆగస్టు 3: జాతీయ రహదారిపై రాజానగరం భారత్ పెట్రోలు బంకు సమీపంలో శనివారంరాత్రి రెండు ట్రావెల్ బస్సులు ఒక దానిని ఒకటి ఢీకొనడంతో ట్రావెల్ బస్సు తిరగబడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలుకాగా ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. త్రుటిలో పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. స్థానిక ఫుడ్‌కోర్ట్ సమీపంలో రహదారిపై రెండు కార్లు ఆగి ఉండటంతో హైదరాబాద్ వైపుగా వెళ్తున్న ట్రావెల్ బస్సు వాటిని తప్పించే క్రమంలో బస్సు స్లో అయ్యింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో ట్రావెల్ బస్సు ఢీకొని తిరగబడటంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు బస్సులో ఉన్న ప్రయాణికులందరినీ బయటకు రప్పించి, మరో బస్సులో తరలించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలి

రంపచోడవరం, ఆగస్టు 3: 2024-25 విద్యా సంవత్సరానికిగాను గిరిజన సంక్షేమ గురు కుల కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల్లో సీట్ల సంఖ్యను పెంచాలని రాష్ట్ర గురుకుల కార్యదర్శికి లేఖ ద్వారా కోరినట్లు అల్లూరి సీతారామరాజుజిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు బాలు అకిసా తెలిపారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరిగిందని, ప్రతి కళాశాలలో ప్రతి గ్రూపుకు 10 సీట్ల చొప్పున పెంచాలన్నారు.

ఇంటర్ ఫెయిలైనా ఐటీఐలలో ప్రవేశం

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్ ఫెయిలైన అభ్యర్థులకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 ఏడాదికి ప్రవేశాలకు మూడో విడత దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ పేర్కొన్నారు. అధికారిక వెబ్‌సైటులో ఈ నెల 26 వరకూ దరఖాస్తు చేసుకొని రసీదు పొందాలన్నారు. 27 వరకూ వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుదన్నారు. వివరాలకు 9294050231 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధారణ ఆదివారం నుంచి తప్పనిసరి చేస్తూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేసే విధంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) చర్యలు తీసుకోవడం జరిగిందని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. హెల్మెట్ ధారణపై తాండవ యోగేశ్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 3707 ద్విచక్ర వాహన ప్రమాదాలు జరిగితే అందులో 3047 మంది మరణించడం బాధాకరమైన విషయమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించకపోతే చట్ట ప్రకారం చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పంద్రాగస్టు వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3 : రాజమహేంద్రవరం ఆర్ట్స్‌కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులలతో సమీక్షించారు. ఆగస్టు 15 వేడుకలు విజయవంతం చేయాలన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన వాని పేర్లనే అవార్డులకు సిఫార్సు చేయాలని సూచించారు. అవార్డుకు గౌరవం పెరిగే విధంగా ఉత్తమ పని తీరును కనబరిచిన వారిని మాత్రమే గుర్తించి పేర్లను ఈ నెల 10వ తేదీలోగా పంపించాలన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలతో కూడిన శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 15న ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు ,ఇతర ప్రముఖులు ప్రతి ఒక్కరు ఆహ్వానితులేనన్నారు. పైలెట్ వాహనం ,శకటాల ప్రదర్శనకు ఉపయోగించే వాహనాలు ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలన్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికి సరిపడా తాగునీరు సమకూర్చాలని సూచించారు. పోలీస్, ఎన్‌సీసీ విభాగాల గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జేసీ ఇన్‌చార్జి,డీఆర్వో జి.నరసింహులు, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ,కేఆర్‌సీసీ డిప్యూటి కలెక్టర్ నాయక్, వివిధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు, ఆగస్టు 3 : కౌలు కార్డు పొందిన రైతులందరికి వ్యవసాయ రుణాలందించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. కొవ్వూరు యూనియన్ బ్యాంకును శనివారం సందర్శించి మాట్లాడారు. గుర్తింపు కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయానికి అవసరమగు పెట్టుబడి సాయం కింద పంట రుణాలు అందించాలన్నారు. పంట రుణాలు తీసుకున్న కౌలు రైతులు సకాలంలో తమ రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు పి. చంద్రశేఖర్,వ్యవసాయాధికారి గంగాధర్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 3 : పీఎం విశ్వ కర్మ యోజన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన పీఎం విశ్వకర్మ యోజన నోడల్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ స్థాయిలో డీపీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టి నిబంధనల మేరకు పేర్లు నమోదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రూరల్ ప్రాంతాల్లో 79 వేల మందిని గుర్తించగా 65 వేల మంతికి పైగా డేటా పరిశీలించినట్టు జిల్లా పరిశ్రమల అధికారి పికేవి ప్రసాద్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 63 వేల మందిని గుర్తించగా డేటా ఎంట్రీ జరుగుతున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



స్కూల్ ఆటోలపై కేసులు రూ.3 లక్షల జరిమానా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3 : జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆటోల తనిఖీలు చేపట్టి పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతున్న 50 ఆటోలపై కేసులు నమోదు చేశారు. రూ.2,87,700ల జరిమానా వసూలు చేశారు. ప్రస్తుతం కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో స్కూల్ ఆటోల్లో ఎక్కువ మంది విద్యార్థులను తీసుకెళ్లడంపై ఫిర్యాదులు అందడంతో చర్యలు తీసుకున్నామని జిల్లా రవాణా అధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరంగా చేపట్టామని, ప్రత్యేక డ్రైవ్ ద్వారా కేసులు నమోదు చేశామని తెలిపారు. తల్లిదండ్రులు ఆటోల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎవరైనా మోటారు వాహనాల చట్టాల ఉల్లంఘనలకు పాల్పడినా, నిబంధనలు పాటించకపోయినా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.



తీసెయ్.. వేసెయ్!

వైసీపీతో అంటకాగినోళ్లకు చుక్కలే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో అధికారులు రెచ్చిపోయారు.. వీళ్లు వైసీపీ నాయకులా.. లేదంటే అధికారులా అనేంతగా అంటకాగారు.. వైసీపీ నాయకులు అన్నారని 30 ఏళ్లు జగనే సీఎంగా ఉంటారని అనుకున్నారో ఏమో కానీ.. వాళ్లు చెప్పిందల్లా చేసేశారు.. మాజీ ఎమ్మెల్యేలని చూడకుండా.. ప్రతిపక్ష పార్టీ నాయకులనీ చూడకుండా.. కనీస గౌరవలేకుండా ప్రవర్తించారు. రోజులన్నీ ఒకేలా ఉంటాయా.. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. వైసీపీతో అంటకాగిన అధికారుల కోరలు పీకేస్తున్నారు.. అన్ని విభాగాల్లోనూ ఉన్న అధికారులను తీసి పక్కన పెడుతున్నారు. పోలీసులనైతే వీఆర్‌కి పంపుతుంటే.. ఉన్నతాధికారులను ఆయా డిపార్ట్‌మెంట్లకి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశిస్తున్నారు. దీంతో నాడు వైసీపీ ప్రభుత్వంలో రెచ్చిపోయిన అధికారులంతా బోనులో పడ్డ ఎలుకలా ఏం చేయాలో తోచక కొట్టుకుంటున్నారు.

మాట్లాడితే కేసులే..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇపుడిప్పుడే పాత వాసనలు పోతున్నాయి. గత వైసీపీ పాలనలో అధికార యంత్రాంగం అంతా వైసీపీ నేతలు చెప్పినట్టే చేసి, చట్టాలకు, నిబంధనలకు తూట్లు పొడిచిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష నాయకులకు ప్రజలకు స్వేచ్ఛ ఉండేది కాదు. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేశారు. ఎక్కడ సమావేశం పెట్టుకోవాలన్నా, తమ హక్కుల కోసం ఆందోళన చేయాలన్నా అనుమతులుండేవి కావు. ఎవరైనా ఆందోళనకు పిలుపు ఇస్తే అందరికీ 41 నోటీసులు జారీ, సెక్షన్ 30, సెక్షన్ 144 అమలు, సాధారణ ప్రజలైతే పోలీసు స్టేషన్లలో మాట్లాడే పరిస్థితే ఉండేది కాదు. ప్రతిపక్షాలైనా, ఉద్యోగులైనా సరే.. హౌస్ అరెస్ట్ చేసేవారు. తెలుగుదేశం నేతలనైతే బయటకే రానిచ్చేవారు. కాదని బయటకు వస్తే కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. దీంతో నాటి ప్రతిపక్ష నాయకులపై పదుల సంఖ్యలో కేసులు పెట్టారు. ఒకసారి ఆ లిస్ట్ చూస్తే అమ్మో అనక మానరు...

నాటి కలెక్టర్ ఇష్టారాజ్యం..

వైసీపీ పాలనలో భూఆక్రమణలు, బెదిరింపులు, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయ్, సారా, డ్రగ్స్ బ్యాచ్‌లు పెచ్చురేగిపోయిన సందర్భాలు అనేకం. ఇక అవినీతికి అంతే లేదు. జిల్లా కలెక్టరేట్ కేంద్రంగానే భూదందాలు జరిగిన సంగతి తెలిసిందే. గోపాలపురం మండలంలో భీమోలులో ఒక భూ వివాదం కోర్టులో ఉండగానే గత కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ వైసీపీ నేతలతో కుమ్మక్కయి సుప్రీంకోర్టును తప్పుదారి పట్టించి కౌలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇతరులకు అమ్మించేసిన సంగతి తెలిసిందే.ఇందులో రూ. కోట్లు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి.రాజమ హేంద్రవరం రూరల్‌లో సుమారు 23 ఎకరాల భూమి రికార్డులు సృష్టించి ఇలాగే పక్కదారిపట్టించారు. సమన్వయం పేరిట రెవెన్యూ, పోలీసు ఒకటైపోయి అనేక అక్రమాలకు పాల్పడ్డారు. తహశీల్దార్లు, డీటీలను భయపెట్టి దానవాయిపేటలో ఒకచర్చి యజమానికి చెరువు పోరంబోకు భూమిని రాసిచ్చి, దానిని వేర్వే వాళ్లకు అమ్మేసేటట్టు అధికారులు సహకరించినట్టు ఆరోపణలున్నాయి.గ్రామ స్థాయి నుంచి కలెక్టరేట్ వరకూ అధికారులు, ఉద్యోగులు ఇష్టమున్నా లేకున్నా వైసీపీ నేతలు చెప్పినట్టు చేశారు. దివాన్‌చెరువులో ఓ కామన్ సైట్‌లో ఒక వ్యక్తి ఇల్లు కట్టుకోవడానికి ఏకంగా గత కలెక్టర్ జోక్యం చేసుకుని, పంచాయతీ సెక్రటరీని బెదిరించిన సంగతి తెలిసింది. అది కామన్ సైటని, తాను రాసివ్వలేనని చెప్పిన సెక్రటరీ వెంటనే మరొక మండలానికి స్వయంగా కలెక్టర్ బదిలీ చేయించడం గమనార్హం.దీంతో ఆ కలెక్టర్, జేసీ బదిలీపై వెళ్లిపోయారు. పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్ స్టేషన్లుగా మారిపోయాయి. కొందరు నాయకులైతే తమ కులానికి చెందిన సీఐలనే నియమించుకున్నారు. ఇక వాళ్ల ఇష్టం ఒక ప్రక్క రాజకీయ అండ, మరొక ప్రక్క కులం కూడా కలిసి రావడంతో వాళ్ల ఇష్టానుసారం వ్యవహరించారు. సీఐలు ఐడీ పార్టీ కింద కొందరు కానిస్టేబుళ్లను పెట్టుకుని వాళ్లు పాత కేసుల్లో ఉన్నవారితో, గల్ఫ్ ప్రాంతాలకు మహిళలను పంపేవారితో అంటకాగి తప్పుడు కేసులు పెట్టించి పోలీసు స్టేషన్లలో సెటిల్ చేసిన సందర్భాలు ఉన్నాయి. సాక్షాత్తు అప్పట్లో హోం మినిస్టరే జిల్లా వాసి అయినప్పటికీ పోలీసుల ఆగడాలను ఆపలేకపోయారు.ఆమె నియోజక వర్గంలోనే అనేక దారుణాలు జరిగిన సంగతి తెలిసిందే. ఇలా అన్ని వ్యవస్థలు నిర్వీర్యమైపోయాయి.

అనపర్తి ఎమ్మెల్యేపై 39 కేసులు

ప్రస్తుత అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై 39 కేసులు పెట్టారు. చంద్రబాబుపై అనపర్తిలో 2, బిక్కవోలులో ఒక కేసు పెట్టారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై 11 కేసులు పెట్టారు. ఇటీవల 3 కొట్టేశారు. 8 పెండింగ్‌లో ఉన్నాయి. ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావుపై 2 కేసులు ఉన్నాయి. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కూడా సెంట్రల్ జైలులో బెయిల్ లేకుండా చాలా రోజులు మగ్గారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణపై 6 కేసులు నమోదు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిపై 8 కేసులు పెట్టారు. 6 కొట్టేశారు.. రెండు పెండింగ్‌లో ఉన్నాయి. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుపై 6 కేసులు పెట్టారు. నిడదవోలు ఎమ్మెల్యే, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌పై కూడా 8 కేసులు పెట్టారు. ఈ నెల 7న ఒక కేసులో కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. ఇలా వాళ్లూ వీళ్లూ అని లేదు.. అధిష్ఠానం ఆదేశించడం లోకల్ అధికారులు కేసులు పెట్టేయడం పరిపాటిగా మారింది. గతేడాది మేలో రాజమహేంద్రవరంలో జరిగిన మహా నాడు సక్సెస్ కాకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వా సు, ఆదిరెడ్డి అప్పారావులను జైలులో నిర్బంధించారు. వైసీపీతో అంటకాగిన వారికి చెమటలు పడుతున్నాయి.

- నాడు వైసీపీతో చెట్టాపట్టాల్
- ప్రస్తుత ఎమ్మెల్యేలపై కేసులు
- పోలీస్ స్టేషన్లలో సెటిల్‌మెంట్లు
- ఒక్కో శాఖ నుంచి ఏరివేత
- పలువురు అధికారుల బదిలీ
- కలెక్టర్ నుంచి ఆరంభం
- తరువాత ఎస్పీ..జేసీ వంతు
- కమిషనర్..జేసీల మార్పు
- తహశీల్దార్లకు స్థాన చలనం
- ఇద్దరు సీఐలకు నో పోస్టింగ్
- నేడు లెక్కలు తీస్తున్న కూటమి

లెక్కతేలుస్తున్న కూటమి..

కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడిన.. వైసీపీతో అంటకాగిన అధికారులులెక్కలు తీస్తున్నారు. జిల్లాలో చూస్తే మొదట జిల్లా కలెక్టర్ మాధవీలతపై వేటు వేశారు. పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలనా శాఖలో రిపోర్ట్ చేయమని ఆదేశించిన సంగతి తెలిసిందే. తర్వాత అప్పటి ఎస్పీ పి.జగదీష్‌కు పోస్టింగ్ ఇవ్వకుండా బదిలీ చేశారు. ఇసుక అక్రమాలపై విచారణ చేసిన రిపోర్టు ఇవ్వమంటే అప్పటి కలెక్టర్ మాధవీ లత మాదిరిగానే ఎస్పీ జగదీష్ కూడా తప్పుడు రిపోర్టు ఇచ్చిన సంగతి తెలిసిందే.అప్పుడు వైసీపీతో అంటకాగిన వారిని ఒక్కొక్కరి వంతున బదిలీ చేస్తున్నారు. ఇటీవల ఐదుగురు డీఎస్పీలను ఒకేసారి బదిలీ చేశారు. ఒకా యనకు పోస్టింగ్ ఇవ్వలేదు. తర్వాత చాలా మంది సీఐలను బదిలీ చేశారు. కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చి, కొందరికి ఇవ్వలేదు. ఇంకా కొందరు కులంపేరుతో, వేరే కారణాలతో కాకా పట్టి కొనసాగుతున్నారు.జేసీ, మునిసిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. తహశీల్దార్లు బదిలీ అయ్యారే కానీ ఇంకా ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వ లేదు. గతంలో పని చేసిన నియోజకవర్గాలు,సొంత డివిజన్ల పరిధిలోనూ వారికి పోస్టింగ్‌లు ఇవ్వకూడదనే నిబంధన పెట్టడంతో చాలా మంది తహశీల్దార్లకు మింగుడు పడడం లేదు. ఎమ్మెల్యేలను కాకా పడుతున్నారు.రేపోమాపో వీరికి పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది. తాజాగా శుక్రవారం సీఐలను బదిలీ చేశారు.ఐదుగురిని బదిలీ చేయగా ఇద్దరికి పోస్టింగ్ ఇవ్వలేదు.ఒకరిని హోల్డ్‌లో పెట్టినట్టు సమాచారం.ఇంకా చాలా మంది బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.అధికారులు అప్పట్లో ఎలా వ్యవహరించారనే ఎంక్వయిరీలు జరుగుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం జిల్లాకు కొత్తగా వచ్చే అధికారులైనా గుణ పాఠం నేర్చుకోవాలి.రాజ్యాంగాన్ని కాపాడుతూ చట్టప్రకారం పనిచేస్తే పాలకులెవరైనా ప్రశాంతంగా ఉంటుంది.



కొవ్వాడ కాల్వ మ్యాప్ చూసి అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రతి రైతును ఆదుకుంటాం

ముంపు బాధిత రైతులకు ఎంపీ పురందేశ్వరి హామీ

గోపాలపురం/ దేవరపల్లి, ఆగస్టు 3 : పంట నష్టపోయిన ప్రతి రైతును ఎన్‌డీఏ ప్రభుత్వం ఆదుకుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం గోపాలపురం మండలం వెంకటాయపాలెం, చిట్యాల, చెరుకుమిల్లి ,దేవరపల్లి మండల గౌరీపట్నం గ్రామాల్లో ముంపు బారిన పడిన పంట పొలాలను శనివారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి ఆమె పరిశీలించారు.గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో ప్రవహిస్తున్న కొవ్వాడ, తాడిపూడి, యర్ర కాల్వల వరదనీటి ప్రవాహానికి ప్రతి ఏటా నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కలయికతో శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో 4600 మండలంలో ఎకరాలు దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారన్నారు. రైతులు ఆండ్రూ సత్తిరాజు, బుల్లిరాజు, దాపర్తి వీరకృష్ణ, దాపర్తి సోమరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్‌లు కొవ్వాడ కాల్వ కారణంగా ప్రతి ఏడాది వేలాది ఎకరాలు ముంపు గురవుతున్నాయన్నారు.కొవ్వాడ కాల్వ మ్యాప్ పరిశీలించారు.పంటనష్టం పూర్తి వివరాలను అధికారులు నమోదు చేయాలని ఆదేశించారు.ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది వర్షాకాలంలో రైతులకు ఈ పరిస్థితులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు,మండల అధ్యక్షుడు రొంగలి సత్య నారాయణ,ఏడీ చంద్రశేఖర్, ఏవో పి.రాజారావు,వీరరాఘవులు, మద్దిపాటి రమేష్, జ్యేష్ట శ్రీనివాస్,కాకర్ల రామతులసి, ఈలి శరత్‌బాబు, రాము,ఇల్లూరి రాము,ప్రసాద్‌బాబు,తహశీల్దార్‌శ్రీనివాస్,ఎంపీడీవో ప్రభాకరరావు పాల్గొన్నారు.



నర్సరీ ప్రతినిధులతో చర్చిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్

పర్యాటక కేంద్రంగా కడియం : మంత్రి దుర్గేష్

కడియం, ఆగస్టు 3: కడియం నర్సరీలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం కడియం నర్సరీలు పర్యాటకంగా అభివృద్ధిపై నర్సరీ అసోసియేషన్ సభ్యులు, నర్సరీ ప్రతినిధులతో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతిలతో కలిసి సమీక్షించారు. కడియం నర్సరీలలో మొక్కలు కొనుగోలు చేసేవారి కంటే పర్యాటకులు ఎక్కువ మంది వస్తుంటారన్నారు. అదనపు సౌకర్యాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం చేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నర్సరీలను మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా చేసుకుని ప్రతిపాదనకు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. కాటేజెస్ నిర్మాణం చేపట్టి ఒకటి రెండు రోజులు ఉండేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. 200 ఎకరాల స్థలంలో కెఫ్టేరియా, ఆర్టిస్టిక్ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కడియం నర్సరీల ఆధ్వర్యంలో ఎఫ్‌టీవోలు గుర్తింపు తీసుకురావడం ద్వారా వారు రూపొందించే ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కడియం నర్సరీలకు అంతర్జాతీయ గుర్తింపు ఉన్నా సరైన ప్రోత్సాహం లభించడం లేదన్నారు.నర్సరీ అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ కడియం నర్సరీలు పర్యాటకం ద్వారా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నట్టు తెలిపారు.సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి నరసింహులు, టూరిజం ఆర్‌డీవీ స్వామినాయుడు, పలువురు నర్సరీరైతులు, అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొనారు. సమావేశానికి ముందు కడియపులంక ఏపీ టూరిజం స్థలాన్ని శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎం సునీల్, ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ తదితరులు ఉన్నారు.



ముందడుగు!

మద్యం పాలసీపై కూటమి కసరత్తు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గొంతులో నాణ్యమైన చుక్కపడి ఐదేళ్లయ్యింది. ధరలతో జేబుకు పెద్ద చిల్లు పడింది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత మందుబాబులు అందుబాటు ధరలో నాణ్యమైన కిక్కు కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఐదేళ్లపాటు పిచ్చి బ్రాండ్లతో ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకున్న మందుబాబులకు కూటమి ప్రభుత్వం త్వరలోనే నాణ్యమైన కిక్కు ఇవ్వనుంది. మళ్లీ 2019కి ముందు రోజులు మందు బాబులు చూడనున్నారు. ప్రాణాలు మింగేస్తున్న జగన్ పిచ్చి బ్రాండ్లను తీసేసి గతంలో టీడీపీ హయాంలో మాదిరిగా నాణ్యమైన సరుకు తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ప్రకటించిన హామీ అమలుకు ఇప్పటికే కసరత్తు మొదలైంది. ప్రక్రియ అంతా సజావుగా పూర్తయితే అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది.

వైసీపీలో అంతా దోపిడీనే..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ దారుణమైన మద్యం పాలసీని అమలు చేసిన విషయం తెలిసిందే. జగన్ దెబ్బకు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రం నుంచి పరుగు పెట్టాయి. మద్యం తయారీ కేంద్రాలను(బ్రేవరీలు) వైసీపీ నాయకులు బలవంతంగా సొంతం చేసుకొని రోజుకో బ్రాండును జనాల్లోకి తెచ్చారు. పెద్ద కంపెనీలు జగన్‌కి భయపడి రాష్ట్రంలో అమ్మకాలనే మానేశాయి. ఎంసీ, నాకవుట్ బ్రాండ్ల పేరు విని ఐదేళ్లు గడిచిపోయింది. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇష్టానుసారం ధరలు నిర్ణయించుకోవచ్చని వైసీపీ ప్రభుత్వం జీవో ఇవ్వడంతో బార్లలో ఒక్కో బీరుపై ఎంఆర్పీపై రూ.100-150, క్వార్టరుపై రూ.70 వరకూ అదనంగా లాగేస్తున్నారు. వైసీపీ హయాంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర ఎంఆర్పీ ఎక్కువగా ఉండేది.

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఇలా..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ ఓ పద్ధతిగా ఉండేది. అప్పుడు క్వార్టరు(180ఎంఎల్) నాణ్యమైన సరుకు రూ.120కే దొరికేది.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ధరను అమాంతం రూ.200 చేసేశారు. 'జే' బ్రాండ్లతో షాపులను నింపేశారు. అమ్మకాలు ఎక్కువగా ఉన్న బ్రాండ్లకు మళ్లీ క్వార్టరుకు రూ.20.. తర్వాత రూ.10 అదనంగా తగిలించారు. ఇలా క్వార్టరు రూ.230 అయిపోయింది. సారా వల్ల ఆరోగ్యాలకు ఇబ్బంది కలుగుతోందని గ్రహించిన టీడీపీ పాలకులు చీప్ లిక్కర్‌ని అందుబాటులోకి తెచ్చారు.ఈ మందు ప్రమాణాల ప్రకారం డిస్టలరీల్లో తయారయ్యేది.అయినా దాని ధర మాత్రం రూ.60 మించలేదు. వైసీపీ ప్రభుత్వంలో రంగు సారా సీసాల్లో నింపి ధర రూ.150-180 చేశారు. టీడీపీ ప్రభుత్వంలో లైసెన్సు పొందిన మందు షాపులు ఉండేవి. ఎంఆర్పీపై ఒక్క రూపాయి కూడా అధికంగా వినియోగదారుల వద్ద నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే వ్యాపారస్తులకు కమిషన్ ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని తీసేసింది. అసలే ఎంఆర్పీ అధికమంటే దానిపై ఎంత ఎక్కువకైనా అమ్ముకోవచ్చంటూ బార్‌లకు ధరలను ధారాదత్తం చేస్తూ ఆదేశాలు ఇచ్చేసింది. దీంతో టీడీపీ ప్రభుత్వంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు బార్‌లో కొనాలంటే రూ.210 అవుతోంది. రోజంతా కష్టపడితే రూ.500 వస్తే గతంలో సుమారు రూ.400 ఇంటికి తీసుకెళ్లేవారు. వైసీపీ మద్యం పాలసీ వల్ల రూ.100 కూడా కొంపకు చేర్చడం కష్టమయ్యేది.

- త్వరలోనే నాణ్యమైన కిక్కు
- అక్టోబరు నుంచి కొత్త పాలసీ!
- పాత పద్ధతిలో అమలుకు యోచన
- ప్రైవేటు షాపులు.. అన్ని బ్రాండ్లూ
- జగన్ పిచ్చి బ్రాండ్లు ఖతం
- పక్క రాష్ట్రాల పాలసీపై అధ్యయనం
- ఈ నెల 12 లోపు నివేదికకు ఆదేశం

దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి.

పిచ్చిబ్రాండ్లపై విజిలెన్స్

జగన్ ప్రభుత్వంలో నాసిరకం మద్యానికి చాలా మంది బలైపోయారు. లివర్, గుండె, ఉదర సంబంధిత, మతిమరుపు వ్యాధులు ఎక్కువయ్యాయి. వైసీపీ నాయకులు ఇష్టానుసారం మద్యాన్ని తయారు చేసేవారు. సాధారణంగా పెద్ద కంపెనీలు వారి సొంత ఫార్ములా ప్రకారం మద్యం తయారు చేస్తాయి. వైసీపీ నాయకులు అవేమీ పట్టించుకోకుండా కల్తీ మద్యాన్ని తాగించారు. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో మద్యం వల్ల అప్పటికే ఉన్న వ్యాధులు వేగంగా తీవ్రమై సుమారు 8 వేల మంది వరకూ మరణించారని తెలుస్తోంది. వీరిలో 600 మంది వరకూ నాసిరకం మద్యం తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్ పిచ్చి బ్రాండ్ల నిగ్గుతేల్చే పని ఆరంభించింది. దీనిలో భాగంగా ఈ నెల 21న జిల్లాలోని మూడు మద్యం తయారీ కేంద్రాల్లో విజిలెన్స్ అధికారులు సోదాలు చేశారు. కొవ్వవరంలోని బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ లిమిటెడ్ నుంచి 193, నల్లమిల్లిలోని ఫ్రాగ్ డిస్టిలరీస్ నుంచి 240, కోటపాడులోని పీఎంకే డిస్టిలరీస్‌లో 829 మద్యం నమూనాలను సేకరించింది. నిబంధనలు పాటించలేదని ప్రాథమికంగా అంచనా వేస్తూ మూడు కేసులు నమోదు చేశారు.ఆయా డిస్టిలరీల్లో తీసుకున్న నమూనాలను రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఆర్ఎఫ్ ఎస్ఎల్)కి పంపించారు. ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు హాని కలిగించే కారకాల ఆచూకీపై లోతుగా విశ్లేషణ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పిచ్చి బ్రాండ్లను పూర్తిగా నిర్మూలించి నాణ్యమైన మద్యాన్ని అందుబాటు ధరల్లో ఇవ్వడానికి సన్నాహాలు చేస్తోంది.వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీ ప్రకారం ప్రభుత్వ మద్యం దుకాణాల లైసెన్సులు సెప్టెంబరు వరకూ ఉన్నాయి. ఈలోపు మార్చడం కుదరదు. బార్ల లైసెన్సు ఇంకా ఏడాది ఉంది.ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని న్యాయపరమైన చిక్కులు రాకుండా కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే యోచన లో కూటమి పాలకులు ఉన్నారు.ఇప్పటికే ఎంసీ, సియా గ్రామ్స్ వంటి కంపెనీలతో ఒప్పందాలకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు.దీంతో ఐబీ, ఎంసీ బ్రాందీ వంటి సుమారు 30 రకాల బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. జగన్‌కి భయపడి కనుమరుగైన నాకవుట్,బడ్వైజర్ వంటి బీర్లను మళ్లీ మందుబాబులకు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

కూటమి కొత్త పాలసీ

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చే కసరత్తు మొదలు పెట్టింది.దీనిలో భాగంగా మద్యం పాలసీపై అధ్యయనానికి రాజస్థాన్, యూపీ, తెలంగాణ, కేరళ, తమిళనా డు, కర్నాటక రాష్ట్రాలకు ఉన్నతాధికారుల బృందాన్ని పంపిం చాలని నిర్ణయించింది. అక్కడి బార్లు, మద్యం ధరలు, కొను గోళ్లు, నాణ్యత, చెల్లింపుల విధానం, ఆన్‌లైన్ పేమెంట్లు తదితర అంశాలపై ఈ నెల 12లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.దీని ప్రకారం సీఎం చంద్రబాబు నిర్ణయం తీసు కోనున్నారు. కొత్త మద్యం పాలసీ 2019కి ముందు ఉన్నట్లు రాబోతోందనే చర్చ నడుస్తోంది. దీంతో ధరలు కూడా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పట్లో ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకునేది. జగన్ వచ్చిన తర్వాత సెబ్ అంటూ కొత్త డిపార్ట్‌మెంట్‌ని సృష్టించి గజిబిజి చేసేశారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కి కోరలు పీకి కూర్చోబెట్టారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

బాధిత కుటుంబానికి ప్రభుత్వం సాయం



ఘంటసాల పాపాయమ్మకు చెక్కు అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 3: భారీవర్షాలకు నిడదవోలు మండలం తీరుగూడెం మత్స్యకారుడు ఘంటసాల వెంకటేష్ ఎర్రకాలువలో పడి మృతిచెందడం దురదృష్టకరమని, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసిందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మృతుడి భార్య పాపాయమ్మకు కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఆయన ప్రభుత్వ నిధులు నుంచి రూ.4 లక్షలు చెక్కును అందజేశారు. అలాగే బీమా పథకంలో రూ.5 లక్షలు, మత్స్యశాఖ ద్వారా రూ.5 లక్షలు మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ నరసింహులు, జిల్లా మత్స్యశాఖ అధికారి కేవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చేపల దుకాణాలు తొలగించాలి

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం

కొవ్వూరు, ఆగస్టు 3: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి డౌన్‌లో చేపల దుకాణాల వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణం వాటిని తొలగించాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. బస్ షెల్టర్‌ను ఆక్రమించుకుని, అర్బన్‌హెల్త్ సెంటర్ సమీపంలో చేపల దుకాణం ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. బస్‌షెల్టర్‌లో ప్రయాణికులు నిలబడలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, చేపలు కడిగిన నీరు కిందకు వచ్చి దుర్వాసన వస్తుండడంతో వాంబేకాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. చేపల దుకాణాల వద్ద రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, కార్లు నిలుపుదల చేయడంతో రోడ్డు కం రైలు బ్రిడ్జి పైనుంచి వాహనదారులు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్న చేపల దుకాణాలను నివాస ప్రాంతాలు, ఆసుపత్రి, బస్‌సెల్టర్‌లకు దూరంగా ఏర్పాటుచేయాలని రవిప్రకాష్ డిమాండ్ చేశారు.

అవయవదానంపై అవగాహన సదస్సు

నిడదవోలు, ఆగస్టు 3: అవయవదానంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలక్ష్మి అన్నారు. శనివారం నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను దానం చేయడం ద్వారా మరో నలుగురు జీవితాల్లో వెలుగులు నింపవచ్చునన్నారు. డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ విదేశాలతో పోలిస్తే మన దేశంలో అవయవదానం చాలా తక్కువగా జరుగుతుందని, దీనిపై కళాశాల స్థాయి నుంచే అవగాహన కలిగించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రుద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ లక్ష్మి, నళిని, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, మమత, పద్మ పాల్గొన్నారు.

కాపు జేఏసీ నల్లజర్ల కన్వీనర్‌గా సత్య



నల్లజర్ల, ఆగస్టు 3: కాపు జేఏసీ మండల కన్వీనర్‌గా నల్లజర్లకు చెందిన ఉన్నమట్ల సత్యకిరణ్‌ను నియమించినట్టు రాష్ట్ర కన్వీనర్ శెట్టిపల్లి శివనాగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతులను శనివారం సత్య స్థానిక విలేకర్లకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పర్యటించి కాపు జాతి అభివృద్ధికి, ఐక్యతకు కృషి చేస్తానన్నారు. కాపు జేఏసీ కన్వీనర్‌గా సత్య నియామకం పట్ల కాపు సంఘం నాయకులు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, యర్రా రాధాకృష్ణ, ఉన్నమట్ల రామకృష్ణ, హరిబాబు, నాదిరెడ్డి వినాయక్, రుద్ర శ్రీను హర్షం వ్యక్తంచేశారు.

తలసేమియా బాధితుడికి ఆర్థిక సాయం

నల్లజర్ల, ఆగస్టు 3: దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన ఉండ్రాజవరపు కృష్ణ కుమారుడు లిఖిత్ కిరణ్‌శరత్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో దుద్దుకూరుకు చెందిన ముళ్లపూడి దొరాజీ చౌదరి సమకూర్చిన రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా అందించారు. అలాగే లిఖిత్ కిరణ్‌కు ప్రభుత్వ తరుపున రావలస్సిన పింఛన్ అందించే ఏర్పాట్లు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

తాళ్లపూడి హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజన నిర్వహణ పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

తాళ్లపూడి, ఆగస్టు 3: ఆరోపణలు రాకుండా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు చెప్పారు. ఇటీవల పలు చోట్ల కోడిగుడ్లు పాడవుతున్నాయని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను ఎంపీడీవో వెంకటరమణతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి పిల్లలకు పెట్టే భోజనాన్ని రుచి చూశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఆరోపణలు రాకుండా నిర్వహణ ఉండాలని సూచించారు. అలాగే స్థానిక మెయిన్‌రోడ్డులో పలు చోట్ల శిథిలావస్థలో ఉన్న డ్రైన్‌ను ఎంపీపీ పరిశీలించారు. కొత్త డ్రైన్ నిర్మాణానికి కార్యాచరణ ప్రారంభించాలన్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులను సమన్వయం చేసుకుని డ్రైన్ సమస్య తీర్చాలని అధికారులకు సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఆశాఅలేఖ్య తదితరులున్నారు.

ఆర్పీలకు గదిని కేటాయించాలి

నిడదవోలు మునిసిపల్ కమిషనర్‌కు వినతి

నిడదవోలు, ఆగస్టు 3: మున్సిపల్ కార్యాలయ పరిధిలో మెప్మా విభాగంలో పనిచేస్తున్న 25 మంది ఆర్పీలకు మున్సిపల్ కార్యాలయంలో ఒక గదిని కేటాయించాలని ఆర్పీల యూనియన్ అధ్యక్షురాలు అడ్డాల మరియకుమారి కోరారు. ఈ మేరకు శనివారం నిడదవోలు మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు రామ్‌భూపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఆర్పీలు రోజువారీ దినచర్యలో భాగంగా కార్యాలయానికి వస్తున్నారని, వారు ఉండేందుకు ప్రదేశం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 25 మంది కార్యాలయం హాలులో కూర్చుని పనిచేసుకోవడం వల్ల మిగతా వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాధనాల సీతాదేవి, ఆర్పీలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



చాగల్లు, ఆగస్టు 3: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి సతీష్ అన్నారు. చాగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలను కూటమి నాయకుల చేతులమీదుగా అందజేశారు. గత ప్రభుత్వ పాలనలో కళాశాల తీవ్ర నిర్లక్ష్యానికి గురయిందని, కనీస వసతులు సైతం కల్పించలేదని సతీష్ విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కోడి చంటియ్య, ముళ్ళపూడి రాము, తాళ్ళూరి వరప్రసాద్, గ్రంధి రాంబాబు, జుట్టు గణపతి, ఇంటి వీరబాబు, మిరియాల సతీష్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ నాయకుడు కైగాల శ్రీనివాసరావు విచ్చేసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఫస్టియర్ 118 మంది, సెకండియర్ 84 మంది విద్యార్థులకు పుస్తకాలు వచ్చాయని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏటిగట్టుపై ట్రాఫిక్ కష్టాలు



కొవ్వూరు–తాళ్లపూడి ఏటిగట్టు రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

- ఇసుక రవాణాతో కొవ్వూరు-తాళ్లపూడి రోడ్డులో రద్దీ
- రహదారికి ఇరువైపులా నిలిపివేస్తున్న ఇసుక లారీలు


ఏటిగట్టుపై రోడ్డు మీద నిలిపిన లారీలు

తాళ్లపూడి, ఆగస్టు 3: కొవ్వూరు-తాళ్లపూడి ఏటిగట్టు రహదారిలో గోదావరి తీరంలో ఇసుక విక్రయాలు ప్రారంభం కావడంతో ఈ దారిలో ప్రయాణించే వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. కొవ్వూరు నుంచి తాళ్లపూడి మండలం బల్లిపాడు, పేద్దేవం, చిడిపి వరకూ ఇదే ప్రధాన రహదారి కావడం, పోలవరం వెళ్లే వారికి సైతం ఇదే దారి ముఖ్యమైనది కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగానే ఉంటుంది. ఇసుక అమ్మకాలు మొదలవ్వడంతో భారీ లారీల రాకపోకలు పెరిగాయి. లోడ్ లారీలు నిబంధనలు పాటించపోగా రోడ్డు కిరువైపులా నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఏటిగట్టు తారురోడ్డు కాస్తా బురదతో మట్టిరోడ్డులా మారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు దృష్టి సారించి ప్రజలకు రహదారి ఇబ్బందులు తొలగేలా కృషి చేయాలని పలువురు వాహన దారులు కోరుతున్నారు.

వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వేస్టేషన్


రాజమండ్రి రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ పురందేశ్వరి

- కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో మరికొన్ని రైళ్లకు హాల్ట్
- ఎంపీ పురందేశ్వరి.. రాజమండ్రి స్టేషన్ పరిశీలన
- తూర్పు రైల్వేస్టేషను రోడ్డు విస్తరణ : గోరంట్ల
- బిక్కవోలు రైల్వేస్టేషన్ అభివృద్ధి : నల్లమిల్లి

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వే స్టేషన్‌ని తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నామని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. రైల్వే స్టేషన్‌ని దాదాపు రూ.270 కోట్లతో అమృత్ భారత్ పథకంలో అభివృద్ధి చేయనున్న సంగతి తెలిసిందే. అయితే ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్ అవసరాల మేరకు ప్లాన్‌లో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని పురందేశ్వరి ఢిల్లీలో కలిసి వివరించారు. మార్పులపై స్పష్టమైన నివేదిక కోసం తమ అధికారులతో కలిసి రాజమండ్రి రైల్వే స్టేషను పరిశీలించాలని ఆయన సూచించారు. దాంతో వెంటనే పురందేశ్వరి శనివారం రాజమండ్రి చేరుకున్నారు. అమృత్ భారత్ స్కీం పనులను గతిశక్తి(రైల్వే బోర్డు) విభాగం చూస్తుండడంతో ఆ అధికారులు, విజయవాడ డివిజన్ అధికారులు కూడా హుటాహుటిన రాజమండ్రి చేరుకున్నారు. ముందుగా ప్లాన్‌ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా స్థానికంగా ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో రైల్వే ఉన్నతాధికారులు ఎంపీకి వివరించారు. ప్రస్తుత ప్లాన్‌లో రైల్వే పశ్చిమ వైపు ప్రధాన ద్వారం, ఐదు అంతస్తులు అధునాతన సదుపాయాలతో భవనం.. పశ్చిమ వైపు రెండు అంతస్తులతో భవనం నిర్మించాలని అనుకొంది. అయితే.. తూర్పు వైపు నగరం వేగంగా అభివృద్ధి చెందుతుండడం, 100అడుగుల రోడ్డు రానుండడం వంటి వాటి వల్ల ప్రధాన అభివృద్ధిని అటువైపునకు మార్చాలని ఎంపీ సూచించారు. తూర్పు వైపు నుంచి 1, 2, 3, 4, 5 ప్లాట్‌ఫాంలు వచ్చేలా మార్పు చేయాలని కోరారని తెలుస్తోంది. తర్వాత ఆమె రైల్వేస్టేషన్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న 50ఏళ్లను దృష్టిలో ఉంచుకొని రైల్వే స్టేషన్‌ని అభివృద్ధి చేస్తామన్నారు. కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో మరికొన్ని రైళ్లను నిలపాలని కోరామన్నారు. వాటితోపాటు 2027 పుష్కరాల నాటికి పనులు పూర్తిచేయాలని కోరగా మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని, ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పురందేశ్వరి అన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తూర్పు రైల్వేస్టేషను రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించామన్నారు. రైల్వే, మునిసిపల్ కార్పొరేషన్ సమన్వయంతో అభివృద్ధి చేస్తామన్నారు. హేవలాక్ వంతెనను పర్యాటకపరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామని వివరించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముడిసరుకుల దిగుమతులను దృష్టిలో ఉంచుకొని బిక్కవోలు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. కేశవరం దగ్గర ఆర్‌వోబీ ఏర్పాటు చేయాలని చెప్పగా భూసేకరణకు కృషి చేస్తామన్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల సూచనలను క్రోడీకరించి ఒక నివేదిక తయారు చేస్తామని డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ పేర్కొన్నారు. ఆ మేరకు రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి పనులు మొదలు పెడతామని చెప్పారు. రోడ్ కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలు నిషేధమని ఇప్పటికే అధికారులకు చెప్పామని ఆయన వెల్లడించారు. అనంతరం పురందేశ్వరి తిరిగి ఢిల్లీ వెళ్లారు. ఎస్ఎంఆర్ రంగనాథ్, డీఈఈ (మెము కార్‌షెడ్) ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్, ఎస్ఎస్ఈ(వర్క్స్) వల్లి, విజయవాడ డివిజనల్ అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై తీర్పు 30 ఏళ్ల పోరాటానికి ఫలితం


కొవ్వూరులో ఉద్యమకారులను సత్కరిస్తున్న రామారావు

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రామారావు

కొవ్వూరు, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో శనివారం కొవ్వూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలభిషేకం చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. వర్గీకరణ పోరాటంలో అమరులైన 18 మందికి మౌనం పాటించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ పోరాటంలో పాల్గొన్న తిగిరిపల్లి శ్రీనివాస్, పౌరోజు జయరాజు, కొడవటి దేవాలను సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వాన్ని విమర్శించిన నాయకుల కళ్లు తెరుచుకునే పరిస్థితి నేడు వచ్చిందన్నారు. దీనికి సహకరించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పసలపూడి హరిబాబు, మల్లిపూడి దుర్గాప్రసాద్, రాపాక శ్రీనివాస్, పెనుమాక జయరాజు, గెల్లా కేశవ, అయినపర్తి రాజేంద్రప్రసాద్, కొప్పాక విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హర్షకుమార్‌ను అరెస్ట్ చేయాలి

నల్లజర్లలో ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన ర్యాలీ

నల్లజర్ల, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్‌ను అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నల్లజర్లలో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మర్లపూడి ఏసుదాసు, కండెల్లి శేఖర్ మాట్లాడుతూ పార్టీ జాతీయ నాయకుడు మంద కృష్ణ మాదిగ 30ఏళ్ల పోరాటం కారణంగానే వర్గీకరణ సాధించుకోగలిగామన్నారు. సుప్రీంకోర్టు తీర్పును, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని తప్పపడుతున్న హర్షకుమార్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గెరా శ్రీను, మోదుగ సుబ్బారావు, ఓలేటి శ్రీను, కలపాల శేషు పాల్గొన్నారు.



నల్లజర్లలో ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణను ఒప్పుకోం

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న ఆంధ్ర, తెలంగాణ మాల సంఘాల ప్రతినిధులు

- మాలమహానాడు రద్దుచేసుకుని వీవీపీఎస్‌లోకి రండి
- న్యాయపోరాటంతో పాటు క్షేత్రస్థాయి నుంచి ఉద్యమం
- స్టేట్ కన్వీనర్ జీవీ హర్షకుమార్
- రాజమహేంద్రవరంలో అత్యవసర సమావేశం
- ఉభయ రాష్ట్రాల నుంచి మాలల హాజరు
- 15న నల్లబ్యాడ్జీలు ధరించాలని పిలుపు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3 : వర్గీకరణ చేస్తే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల పతనం తప్పదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈట్‌అండ్‌ప్లే కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన అత్యవసర మాలల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హర్షకుమార్ నేతత్వంలో ఉభయతెలుగు రాష్ట్రాల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటైంది. దేశంలో మాలమాదిగలను విడదీసేందుకు ఓటు బ్యాంక్ రాజకీయాలకు పెద్దకుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఒక్కసారిగా జాతికి జరుగుతున్న అన్యాయంపై చాలా బాధ కలిగిందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్న వారిలో సమాజంలో అగ్రవర్ణాలతో సమాన స్థాయికి ఎదిగిన వారిని తొలగించడం కాని లేదా దారుణస్థితిలో ఉండి రిజర్వేషన్లు పొందని వారిని తిరిగి చేర్చడం కాని చేసే అధికారం రాష్ట్రపతి,పార్లమెంట్‌కు ఉం టుందన్నారు. అయితే విభజించాలంటే పార్లమెంట్‌లో అమెండ్‌మెంట్ చేసి మెజార్టీ తీర్మానం చేయాలని దాని ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఉంటుందన్నారు. కాని ఏడుగురు జడ్జిల ధర్మాసనం ఏకపక్షంగా తీర్పునివ్వడం దారుణమన్నారు. ఇందులో న్యాయమూర్తి త్రివేది ఈ తీర్పును వ్యతిరేకించారని చెప్పారు. మాలమాదిగలను విడదీసి భవిష్యత్‌లో రిజర్వేషన్లు ఎత్తివేయాలనే కుట్ర దాగి ఉందన్నారు. అందుకే వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు.మాలమహానాడు,సంఘాలను రద్దు చేసుకుని అందరు వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎందుకంటే జీవన్మరణ సమస్యగా ఇది పరిణమిస్తున్న తరుణంలో అందరు ఒకతాటిపైకి రావాలన్నారు. గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలన్నారు. రాజ్యాంగబద్ధంగా చెల్లని వర్గీకరణను ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకోమని అందరం ఐక్యమత్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మల్లెల వెంకట్రావు ఢిల్లీలో సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలు చేసే పనిలో ఉన్నారని తాను కూడా న్యాయపోరాటం చేస్తానన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాల లు కదలకపోతే తీవ్రంగా నష్టపోతామన్నారు. విధివిధానాలు లేకపోయినా అప్పుడే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తామని ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లో గాని వర్గీకరణ జరిగితే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చూస్తారని హెచ్చరించారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాలలంతా భాగస్వాములు అవుతారన్నారు. లీగల్ కమిటీ, యువజన కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయా నాయకులకు హర్షకుమార్ సూచించారు. తెలంగాణ మాల సంఘాల నేతలు టి.రవి (మిర్యాలగూడ), బాలస్వామి (నాగర్‌కర్నూల్), అనిల్‌కుమార్ (పాలమూరు),డాక్టర్ మునిబాబు, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన అంబటి కొండలరావు, బి.చంద్రయ్య (ప్రకాశం),వెంకటేశ్వరరావు (అనకాపల్లి), మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బెన్నయ్య, అరుణకుమారి (గుంటూరు), జ్యోతి మేరి,ఈశ్వరి (ఎన్‌టీఆర్ జిల్లా) ,జంగా బాబూరావు , జీవీ శ్రీరాజ్, రఘుబాబు మాట్లాడారు. మాల ఉద్యోగుల సంఘం స్టేట్ కన్వీనర్‌గా భరత్ భూషణ్‌ను ప్రకటించారు. సమావేశానికి ఆంధ్రా ,తెలంగాణ రాష్ట్రాల నుంచి మాలమహానాడు, మాలసంఘాలు, మాల ఉద్యోగ ప్రతినిధులు హాజరయ్యారు.

సమావేశంలో ఐదు తీర్మానాలు..

అనంతరం ఐదు తీర్మానాలు చేశారు. ఐకమత్యంలో ఉద్యమించాలని, ఉభయతెలుగు రాష్ట్రాల్లో అన్ని మాల సంఘాలను రద్దు చేసి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని, వర్గీకరణ ఉద్యమానికి మాల ఉద్యోగులు పూర్తి సపోర్టుగా ఉండాలని, లీగల్ కమిటీ గైడెన్స్‌లో న్యాయపోరాటం చేయాలని, ప్రతి జిల్లాలో ఇద్దరు.. ముగ్గురిని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి స్టేట్ కమిటీలో సభ్యులుగా ఉంచాలని, పోలీసులను ప్రయోగించి ఉద్యమాన్ని అణచివేయాలనే ప్రయత్నాలు చేస్తారు కాబట్టి చివరి కర్తపు బొట్టు వరకు పోరాడాలి. స్టేట్ కన్వీనర్‌గా హర్షకుమార్‌నే నిర్ణయిస్తూ ప్రతినిధుల సమావేశం తీర్మానాలు చేసింది. ఈ నెల 15న నల్లబ్యాడ్జీలు ధరించి స్వాత్రంతోద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తగ్గిన గోదారి వరద

ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 8.50 అడుగులు


వరద నీటి నుంచి బయటకు కనిపిస్తున్న డ్రెడ్జింగ్ నావ

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద బాగా తగ్గుతోంది. జూలై 19వ తేదీ నుంచి పెరగడం మొదలెట్టిన వరద గోదావరి పెరుగుతూ, తగ్గుతూ, మళ్లీ పెరుగూ వచ్చిన సంగతి తెలిసింది. కానీ రెండు రోజుల నుంచి బాగా తగ్గుతోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద శనివారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 8.50అడుగులకు చేరుకోగా 5,81,417క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తుంది. గోదావరి పాండ్ లెవల్ 13.26 మీటర్లుగా ఉంది. డెల్టా కాలువలకు 8,800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం సాయంకాలం 5గంటలకు 33.90 అడుగులకు చేరింది. ఎగువ భాగంలో వర్షాలు లేవని అధికారులు చెబుతున్నారు. భద్రాచలంలో ఇక పెరుగుదల లేకపోతే మొత్తం వరద లాగేస్తుంది. పొలాలు, డ్రైన్లలోని నీరు కూడా దిగిపోతుంది. పంటల నష్టం పూర్తిగా తెలుస్తుంది. వరి రైతులు తిరిగి మళ్లీ వెదజల్లే పద్ధతిలో సాగుకు వెళతారా, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటారా అనేది కూడా తేలనుంది.

డ్రెడ్జింగ్ నావ వెలికితీత ప్రయత్నాలు విఫలం

ధవళేశ్వరం, ఆగస్టు 3: గోదావరి నీటి మట్టం తగ్గి కాటన్ బ్యారేజ్ గేటుకు అడ్డంగా మునిగిన డ్రెడ్జింగ్ నావ నీటి నుంచి బయటకు కనిపిస్తుండడంతో శనివారం బయటకు తీయడానికి నావ యజమానులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నావకు ఐరన్ రోప్‌లు కట్టి కప్పీల సహాయంతో ఆ ప్రాంతం నుంచి ఒడ్డుకు లాగడానికి చేసిన ప్రయత్నాల్లో బలమైన ఇనుప రోప్ సైతం తెగిపోయింది. నావ దిగువ భాగం బురదలో దిగబడిపోవడంతో బయటకు లాగడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వరద ఉధృతికి గాయిత్రి ఇసుక ర్యాంప్ వద్ద లంగరు వేసిన డ్రెడ్జింగ్ నావ గత నెల 25న కాటన్ బ్యారేజ్ వద్దకు కొట్టుకు వచ్చి 1వ నెంబరు గేటుకు అడ్డంగా మునిగిపోయింది. ప్రస్తుతం నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారిన నావను బయటకు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం మరింత పకడ్బందీ ఏర్పాటుతో నావను బయటకు లాగడానికి జరుగుతున్న ఏర్పాట్లు బ్యారేజ్ ఏఈఈ నాగలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం: సీడీపీవో


పెరవలి: ఖండవల్లిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం

చాగల్లు, ఆగస్టు 3: తల్లిపాలు పుట్టిన బిడ్డకు ఆరోగ్యంతో పాటుగా రోగ నిరోధక శక్తిని ఇస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో మమ్మి అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం చాగల్లులోని 63, 65, 66 కేంద్రాలు సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లిపాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పీవీ పద్మావతి, అంగన్‌వాడీవర్కర్లు వి.విజయకుమారి, పి.వెంకటలక్ష్మి, గంగాభవాని పాల్గొన్నారు. అలాగే మీనానగరం, నెలటూరు, చిక్కాలలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం హెల్త్ సెంటరులో గర్భిణులకు ప్రసవాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ హారికా గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలతోపాటు అన్ని వైద్య సేవలు ఉచితంగానే అందుస్తున్నామన్నారు. హెల్త్ విజిటర్ వేదకుమారి మాట్లాడుతూ గర్భిణులు ప్రభుతాసుపత్రిలో ప్రసవాలు చేసుకోవాలని, ఇక్కడ రక్త పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తామన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, మాతాశిశు సంరక్షణపై అవగాహన కలిగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శిరీష, గౌతమి, గీతాంజలి, సుజాత, శేషుబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజరు భానుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాల సరస్వతి తల్లిపాల విశిష్టను వివరించారు. ఎంపీటీసీ దివ్య మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సరస్వతి, రాణి రత్నకళ, హెల్త్ అసిస్టెంట్ రాణి, రెడ్డి సత్యనారాయణ, సానబోయిన హనుమంతు, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.